జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP సంపుటి : 1 సంచిక: 82 శనివారం 16 ఆగస్టు - 2025 పేజీలు : 8 వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

## రాజ్‌భవన్‌లో హాజరైన రేవంత్ రెడ్డి, మంత్రులు



ఆగస్టు 15(సందేశం టైమ్స్) : తెలంగాణలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆ సందర్భంగా రాజ్‌భవన్ లో నిర్వహించిన 'ఎట్ హోమ్' కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆతిథ్యం వహించారు. ఆయన ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన తేనీటి విందు అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి , డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క హాజరయ్యారు. మంత్రులు, శాసన సభ్యులు, వివిధ పార్టీల నేతలు, ప్రముఖులు కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు. వచ్చిన అతిథులను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తానొక మనసైన ఆతిథ్యంతో స్వాగతించారు. సీఎం రేవంత్ రెడ్డితో కలిసి, ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించారు.

వివిధ రంగాల ప్రముఖులకు పిలుపు

రాజకీయ నాయకులతో పాటు సాహిత్యం, కళలు, విద్య, సేవా రంగానికి చెందినవారూ ఈ విందుకు ఆహ్వానించబడ్డారు. ఇది ఒక సామూహిక స్నేహమైపైన వేదికగా మారింది. ఈ కార్యక్రమం తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా జరిగింది. పింక్ చందనంతో అలంకరించిన వేదిక, సాంప్రదాయ భోజనాలతో అచ్చతెలంగాణ ఆతిథ్యాన్ని చాటింది. వేదిక మొత్తం ఉల్లాసంగా, సాంప్రదాయబద్ధంగా మెరిసింది. స్వాతంత్ర్య దినోత్సవ నేపథ్యంలో రాజకీయ విభేదాలకు అతీతంగా అందరూ ఒకటిగా కనిపించారు.

## 1,500 గాంధీ విగ్రహాలతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



ఆగస్టు 15(సందేశం టైమ్స్) : సాధారణంగా ప్రతి ఏడాది లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగిపోతుంటాయి. కానీ ఈసారి రంగారెడ్డి జిల్లా పాఠశాల ఒక్క అడుగు ముందుకు వేసింది. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మన్నెగూడలోని ఓ ప్రైవేట్ పాఠశాల స్వాతంత్ర్య వేడుకలు ఎంతో ప్రత్యేకంగా జరిపింది. ఈ పాఠశాల తన ఆవరణలో పట్టుదలతో తయారు చేసిన 1,500 గాంధీ విగ్రహాలను ) ప్రదర్శించింది. దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన మహాత్ముడు గాంధీ గారి ఆశయాలు, ఆయన పాఠాలు ఈ తరం పిల్లలకు అర్థం కావాలన్న ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. నేటి పిల్లలు గాంధీని కేవలం దాటి తెలుసుకోవాలి. ఆయన అహింసా సిద్ధాంతం, సత్య మార్గం, స్వచ్ఛతపై ఉన్న నమ్మకాన్ని నిస్వార్థంగా పాటించిన గొప్ప నాయకుడిగా గుర్తుంచుకోవాలి. ఈ పాఠశాల చేసే ప్రయత్నం అదే విషయాన్ని పిల్లల దృష్టికి తీసుకురావడంలో విజయవంతమైంది.

వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నుంచి గుర్తింపు

ఈ వినూత్న ఆలోచనకు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ కూడా అభినందనలతో ముందుకొచ్చింది. పాఠశాలకు ప్రత్యేక మెమొంటోను అందించి, ఈ ప్రయత్నాన్ని గౌరవించింది. ఇది ఆ పాఠశాలకు మాత్రమే కాదు, గ్రామానికి కూడా గర్వకారణంగా మారింది. వినూత్న ప్రదర్శనతో పాటు, పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో తమ ప్రతిభను చాటారు. దేశభక్తి గీతాలు, నాటికలు, గాంధీ జీవితం ఆధారిత చూసిన ప్రతి ఒక్కరూ విద్యార్థుల ప్రతిభపై ప్రశంసలు కురిపించారు.

## కాళేశ్వరం నీరు రాకపోయినా ధాన్యం దిగుబడిలో రికార్డు : సిఎం రేవంత్ రెడ్డి




తెలంగాణ,ఆగస్టు 15(సందేశం టైమ్స్) : కాళేశ్వరం నుంచి చుక్క నీరు రాకపోయినా ధాన్యం దిగుబడిలో రికార్డు సాధించాం అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షాన్ని వ్యక్తం చేశారు. శుక్రవారం 79వ భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గోల్కొండ కోటలో స్వాతంత్ర్య వేడుకలను తెలంగాణ ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన సిఎం రేవంత్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. జెండా ఆవిష్కరణకు ముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కళాకారుల ప్రదర్శనలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. కోలాట నఅత్యాలు, డప్పు చప్పుళ్లతో గోల్కొండ కోట సందడి చేసింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు పోలీసులు. గత కొద్దిరోజులుగా రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న క్రమంలో రెయిన్ ప్రూఫ్ టెంట్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రముఖులు, స్కూల్ పిల్లలు, సందర్శకులు సహా 5 వేల మందికి పైగా అతిథులు హాజరైనట్లు సమాచారం. బందోబస్తు కోసం వేదిక, చుట్టుపక్కల 800 మందికి పైగా పోలీసు సిబ్బందిని అధికారులు మోహరించారు. జెండా ఆవిష్కరణ అనంతరం సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ . అహింసా పద్ధతిలో మహా సంగ్రామాన్ని గెలిచామని అన్నారు. గతేడాది ఆగస్టు 15 న రూ.2 లక్షల రుణమాఫీకి శ్రీకారం చుట్టామన్నారు. విత్తనాలు వేసేనాటికి రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ చేశామని చెప్పారు. పరిమితులు లేకుండా 9 రోజుల్లోనే అన్నదాతల ఖాతాల్లో రూ.9 వేల కోట్లు వేశామన్నారు. రైతులు పండించిన చివరి గింజ వరకు ధాన్యం సేకరిస్తున్నామని తెలిపారు. కాళేశ్వరం నుంచి చుక్క నీరు రాకపోయినా ధాన్యం దిగుబడిలో రికార్డు సాధించాం అని రేవంత్ రెడ్డి హర్షాన్ని వ్యక్తం చేశారు.




మక్తల్ , ఆగస్టు 15(సందేశం టైమ్స్) : 79వ భారత స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఇవాళ నారాయణ పేట జిల్లా మక్తల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వాతంత్ర ఫలాలను ప్రతి ఒక్కరికి అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమ ధ్యేయంగా వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పడక గత పదేళ్లు పాలనలో పేదలకు డబుల్ బెడ్ రూమ్ అందని ద్రాక్షగానే మారిందన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పాడ్డాక ప్రతి పల్లెలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లలో మంజూరు చేయడం జరిగిందన్నారు.




హైదరాబాద్, ఆగస్టు 15(సందేశం టైమ్స్) : బీఆర్ఎస్ కీలక నేతలు అధినేత కేసీఆర్ పిలుపు మేరకు ఎర్రవల్లి ఫాంహౌస్‌కు క్యూకడుతున్నారు. కేటీఆర్, హరీశ్ సహా ముఖ్య నేతలు ఇప్పటికే ఎర్రవల్లి ఫాంహౌస్ కు బయల్దేరినట్టు సమాచారం. మరికాసేపట్లో జరిగే భేటీలో పలు అంశాలు చర్చించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కేసీఆర్ ప్రణాళికలు ఈ సమావేశంలో కీలక భూమిక పోషించే అవకాశం కనిపి స్తోంది. అటు అసెంబ్లీ సమావేశాలు, కాళేశ్వరం రిపోర్ట్ తదితర పరిణామాలపై కూడా చర్చించే అవకాశం ఉంది.

## ఫామ్‌హౌస్‌కు చేరుకున్న కవిత

సిద్ధిపేట, ఆగస్టు 15(సందేశం టైమ్స్) : : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత తన తండ్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ను కలుసుకున్నారు. ఈ మేరకు కుటుంబసభ్యులతో కలిసి శుక్రవారం నాడు ఎర్రవల్లి ఫామ్ హౌస్‌కు చేరుకున్నారు. కవిత చిన్న కుమారుడు ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో అతడికి తన తల్లిదండ్రుల ఆశీర్వాదం ఇప్పించేందుకు కవిత అత్తింటివారితో కలిసి ఫామ్ హౌస్‌కు చేరుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున తన కుమారుడితో కలిసి.. కవిత అమెరికాకు బయలుదేరి వెళ్లనున్నారు. 15 రోజులపాటు కవిత అమెరికాలో ఉండనున్నారు. కుమారుడిని అమెరికా యూనివర్శిటీలో జాయిన్ చేసి.. కొన్ని రోజులు ఆమె అక్కడే ఉండి.. అనంతరం హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. ఇప్పటికే కవిత పెద్ద కుమారుడు అమెరికాలో ఉన్నత విద్యను పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే. ఇక తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకున్న తర్వాత.. కవిత తన కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్




బయలుదేరి వెళ్లనున్నారు. మరోవైపు మాజీ సీఎం కేసీఆర్ పార్టీలోని కీలక నేతలను ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు రావాలని ఆదేశించారు. దీంతో కేటీఆర్, హరీష్ రావులతోపాటు పలువురు కీలక నేతలు ఇప్పటికే ఎర్రవల్లికి పయనమయ్యారు. మరికొద్ది రోజుల్లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక సంస్థల ఎన్నికల అంశంపై చర్చించనున్నారు. ఈ ఎన్నికల్లో గెలుపు కోసం పార్టీ నేతలతో కేసీఆర్ సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. అలాగే అసెంబ్లీ సమావేశాలు, కాళేశ్వరం ప్రాజెక్ట రిపోర్ట్ తదితర అంశాలపై చర్చించే అవకాశమున్నట్లు సమాచారం.

## తెలంగాణలో ఘనంగా బీజేపీ స్వాతంత్ర్య వేడుకలు

ఆగస్టు 15(సందేశం టైమ్స్) : దేశవ్యాప్తంగా మూడురంగుల పండుగ ఘనంగా జరుగుతున్నది. వాడవాడలా త్రీవర్ణపతాకాన్ని ఎగురవేస్తున్నారు. ఢిల్లీలో ఎర్రకోటవద్ద దేశప్రధాని మోదీ జాతీయ జెండాను ఎగరవేసారు. ఈ సందర్భంగా తెలంగాణలో బీజేపీకి చెందిన నాయకులు జాతీయ జెండాను ఎగురవేసారు. బీజేపీ కేంద్ర మంత్రి బండి సంజయ్, తెలంగాణరాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్ర రావు అధ్వర్యంలో త్రివర్ణపతాకాన్ని ఎగురవేసారు. ఈ కార్యక్రమంలో పలువురు రాష్ట్ర బీజేపీ మంత్రులు, నాయకులు పాల్గొన్నారు.

# 79 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 15ఆగస్టు: సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలం జిహెచ్ఎంసి 111. డివిజన్ భారతి నగర్. కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో.. 79 వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని జండా వందనాన్ని త్రివర్ణ పథకాన్ని ఆవిష్కరించారు.. ఈ యొక్క కార్యక్రమంలో . టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు టీ పి యూ ఎస్ మండల అధ్యక్షుడు అబ్బు అలీ ఖురేషి.. మరియు త్రిబుల్ వన్ డివిజన్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై.. ఒకరినొకరు ఆప్యాయతగా పలకరిస్తూ స్వీట్లు పంచుకున్నారు

# సంగారెడ్డిలో ఘనంగ 79 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు








సందేశం టైమ్స్:సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి 15 ఆగస్టు : 79 వ స్వాతంత్ర్య దినోత్సవం ను పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకకు రాష్ట్రవైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథిగా విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా పోలీస్ శాఖ అద్వర్యం లో నిర్వహించిన పరేడ్ ను పరిశీలించారు. స్వాతంత్ర్య సమరయోధులను ఘనంగా సన్మానించారు. అనంతరం జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కళా ప్రదర్శనలను తిలకించారు. సకటాల ప్రదర్శన తిలకించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పోలీస్ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, గ్రామీణ అభివృద్ధి సంస్థ, వ్యవసాయ శాఖ, విద్యాశాఖ, ఉద్యాన పట్టు పరిశ్రమల శాఖ, మిషన్ భగీరథ, మెప్మా , పశు సంవర్ధక శాఖ, మత్స్యశాఖ ల ప్రదర్శనశాల లను తిలకించారు. ఉత్తమ సేవలందించిన వివిధ శాఖల ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందించారు. ఈ వేడుకల్లో టీ జి ఐ ఐ సి నిర్మలా జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి,నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజలు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# కంగ్టి నూతన బదిలీపై వచ్చిన సిఐ వెంకట్ రెడ్డి ని సన్మానించిన

## నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టీస్ కమిషన్ నాయకులు





సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 15ఆగస్టు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలో కంగ్టి సిఐ గా బదిలీపై వచ్చిన నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన కంగ్టి సిఐ వెంకట్ రెడ్డి వారికి శుక్రవారం నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టీస్ కమిషన్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ రహీం, వైస్ చైర్మన్ వై పండరి, రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ గౌస్ చిస్తీ, జిల్లా అధ్యక్షులు కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ మైనోద్దిన్ ఖురేషి, నారాయణఖేడ్ డివిజన్ అధ్యక్షులు ఎన్ నర్సింహులు,శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసిన శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర చైర్మన్ మాట్లాడుతూ.... రక్షకభటులు చట్టాలు పకడ్బందీగా అమలు చేసినప్పుడే నేరాలు తగ్గుతాయని, అప్పుడే ప్రజలకు భరోసా కలుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. వివిధ మండలంలోని గ్రామాలలో అల్లరి ముఖాలను గుర్తించి చట్టాలు నేరస్తులకు ఏ విధంగా శిక్ష పడుతుందో వివరించినప్పుడే కొంత మేరకు నేరాలు జరగకుండా ఉండవచ్చునని ఆశా భావం వ్యక్తం చేశారు.ప్రతి గ్రామాలలో దాతలను గుర్తించి విరాళాలు సేకరించి నేరాలు జరగకుండా సీసీ కెమెరాల కోసం ప్రయత్నం చేయాలన్నారు.సీసీ కెమెరాల వల్ల కొంతమేరకు నేరాలు అదుపు చేయడమే కాకుండా, నేరస్తులను సులువుగా పట్టుకునే అవకాశం ఉందని గుర్తు చేశారు. ప్రజలందరూ పోలీసు వ్యవస్థతో సమన్వయంతో ఉంటేనే ఏ సంఘటన అయిన ముందస్తుగా సమాచారం ఇచ్చి నేరాలు అదుపు చేయడంలో ఒక భాగం ప్రజలేనన్నారు. ఈ కార్యక్రమంలో కంగ్టి మండల అధ్యక్షులు శ్రీనివాస్,నాగల్గిద్ద మండల అధ్యక్షులు వినోద్ కుమార్, నిజాంపేట్ మండల అధ్యక్షులు దుర్గయ్య,న్యాల్ కల్ మండల అధ్యక్షులు నవీన్,న్యాల్ కల్ మండల ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కింగ్ జిన్ టాలెంట్ స్కూల్ లో జాతీయ జెండా ఎగరవేసిన ప్రధానోపాధ్యాయులు



సందేశం టైమ్స్:అందోల్ నియోజకవర్గఇంచార్జి సంగారెడ్డి జిల్లా: పుల్కల్ మండలంలోని కింగ్ జిన్ టాలెంట్ స్కూల్ లో 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ జెండాను ఆ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు జేమ్స్ జెండాను ఎగరవేయడం జరిగింది. విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. నర్సరీ నుండి 7వ తరగతి వరకు ఉన్నటువంటి విద్యార్థిని, విద్యార్థులతో కలిసి జెండాను ఎగరవేశారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన గొప్ప యోధుల త్యాగాలను మరువలేనివి అని విద్యార్థులకు గుర్తు చేశారు. జెండా అనంతరం విద్యార్థులు డాన్స్ లు, పాటలు, పద్యాలతో ఆనందంగా జాతీయ జెండా పండగ నిర్వహించుకున్నారు. జెండా కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎరువుల షాపులో జెండా ఆవిష్కరణ



సందేశం టైమ్స్:సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి 15 ఆగస్టు : మండల కేంద్రమైన కౌడిపల్లి లోని డీసీఎంఎస్ (మహదేవ్ ట్రేడర్స్) ఎరువుల షాపు యజమాని జై గౌడ్ 79 వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేశారు. జై గౌడ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జాతీయ జెండాను గౌరవించినప్పుడే సమాజం అభివృద్ధితోపాటు యువత ముందుండి దేశం కోసం పనిచేస్తుందని అన్నారు. భారత పౌరునిగా ప్రతి ఒక్కరూ జాతీయ జెండా ఎగరవేయాలని అప్పుడే గౌరవం దక్కుతుందన్నారు. అనంతరం పిల్లలకు

# 79వ స్వాతంత్ర్య దినోత్సవం జాతీయ పతాక ఆవిష్కరణ చేసిన

## ప్రధానోపాధ్యాయుడు పి నాగిరెడ్డి








సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 15ఆగస్టు సంగారెడ్డిజిల్లా వట్పల్లి మండల్ పరిధిలో ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మర్వెల్లి లో 79వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో జాతీయ పతాకాన్ని ఎగురవేసి విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పిసిసి వైస్ ప్రెసిడెంట్ పట్లోళ్ల సంగమేశ్వర్ మాట్లాడుతూ ఎందరో త్యాగధనులు, మహానుభావులు చేసిన పోరాట ఫలితంగానే మనకు స్వాతంత్ర్యం లభించిందని , యువత సంకల్పం చేస్తే ఏదైనా సాధించవచ్చునని, భారతదేశం ఎన్నో రంగాలలో వేగంగా అభివృద్ధి చెందుతోందని, యువతకు విస్తారమైన అవకాశాలు ఉన్నాయని, భారతదేశం అందించిన గొప్ప విద్యాసంస్థలు, అవకాశాలను వినియోగించుకొని, బాధ్యతగల పౌరులుగా సమాజ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని, బిన్నత్వంలో ఏకత్వం పాటిస్తూ ప్రేమ, అనురాగాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సామ్రాజ్యవాద సంకెళు తెంచుకొని స్వేచ్ఛ సాధించిన చారిత్రాత్మకమైన రోజని, ఈ సందర్భంగా స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకుందాం అని పిసిసి వైస్ ప్రెసిడెంట్ పేర్కొన్నారు. భారతీయులుగా పుట్టినందుకు గర్వించాలి, మహిళలను గౌరవించాలి, మెరుగైన సమాజాన్ని నిర్మిద్దాం" అని పిలుపునిచ్చారు. విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలోరాజు పటేల్, మాజీ ఉపసర్పంచ్ బస్వరాజ్,,మాజీ ఎంపిటిసి తమన్న గారి సంగన్న, మాజీ సర్పంచ్ శ్రీశైలం, కోమటి నాగరాజు, ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు, గ్రామ యువకులు, గ్రామ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# ఎన్టీఆర్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగ 79 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు





సందేశం టైమ్స్ : సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి :ఈరోజు మనం అనుభవిస్తున్న ఈ స్వేచ్ఛ వాయువులు అనే స్వాతంత్రాన్ని, ఎందరో మహానుభావులు వారి యొక్క విలువైన సమయాన్ని మరియు వెలకట్టలేని వారి యొక్క జీవితాన్ని భావి పౌరుల కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా, అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని కూకటివేళ్లతో పెకలించివేసి మన భారతీయ సోదరులందరికీ స్వేచ్ఛ అనే స్వాతంత్రాన్ని అందించి వారు కనుమరుగైపోయారు.నేడు 79వ భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిజాంపేట్ 191 ఎన్టీఆర్ నగర్ వద్ద మన శివాలయం గ్రౌండ్లో జాతీయ జెండాను ఆవిష్కరించి, గీతాలాపన చేసిన నిజాంపేట్ మాజీ డిప్యూటీ మేయర్ శ్రీ ధనరాజ్ యాదవ్ , ఎన్ఎంసి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్ లు ప్రణయ ధనరాజ్ యాదవ్, పెద్దిరెడ్డి సుజాత,బాలాజీ నాయక్, సీనియర్ నాయకులు, నాయకులు.మన స్వాతంత్రం కోసం పోరాడిన మహానుభావులందరినీ స్మరించుకోవటం మన కనీస బాధ్యత అందుకే మన భారతదేశం స్వాతంత్రం పొందిన ఆగస్టు 15వ తారీకుని మన భారతీయులందరరూ ఒక పండుగలాగ చేసుకుంటున్నారు అని తెలియజేసి కాలనీవాసులందరికీ కూడా స్వీట్స్ పిల్లలకి చాక్లెట్స్ పంచి జాతీయ గీతాన్ని ఆలపించి కాలనీవాసులం దరికీ 79 వ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ జెండా వందన కార్యక్రమంలో అధ్యక్షులు-రాజేష్ రామ్ ,మహిళా అధ్యక్షురాలు-శ్రీమతి శోభారాణి ఉపాధ్యక్షులు-పవన్ కుమార్ దత్తు , అచ్యుతు ,జనరల్ సెక్రెటరీ-పగడాల శ్రీనివాస్ రెడ్డి ,జాయింట్ సెక్రెటరీ-ఉపేంద్ర, నరసింహ ,మాజీ అధ్యక్షులు-కిట్టు మరియు కాలనీవాసులు పెద్దలు-పిల్లలు జండా వందనం చేసి వారి యొక్క దేశభక్తిని తెలియజేశారు.

# సంపాదకీయం

## క్రైస్తవులకూ తప్పని వేధింపులు

నరేంద్ర మోదీ 2014లో దేశ ప్రధానమంత్రి అయిన నాటి నుంచీ భారతీయ ముస్లింల పట్ల వ్యవహరిస్తున్న తీరుతెన్నులను పలువురు ఆక్షేపిస్తున్నారు. మోదీ సర్కార్‌ను 2002 గుజరాత్ మతోన్మాద హింసాకాండ వెన్నాడుతూనే ఉన్నది, హిందుత్వ భావజాల మెజారిటీవాద ప్రపంచ దృక్పథమే ప్రభావితం చేస్తూనే ఉన్నది. భారతీయ ముస్లింలు 'పరాయివారు, ప్రమాదకారులు'గా ఆయన ప్రభుత్వం పరిగణిస్తుందన్న భావనను ప్రజల మనసు నుంచి రూపుమాపలేకపోతున్నారు. సంఘ్ పరివార్‌లోని కరడుగట్టిన తీవ్రవాదుల మూలంగా మోదీ ప్రభుత్వం తనపై ఉన్న ముస్లిం వ్యతిరేకతా ముద్రను వదిలించుకోలేకపోతోంది. హిందుత్వ ఉన్మాదులు తమ మాటలు, చేతల్లోను ముస్లింలకు వ్యతిరేకంగా అమానుష నేరాలకు పాల్పడుతున్నారు. ఇటీవల కర్ణాటకలోని బెల్గావి నియోజకవర్గంలో శ్రీరామ సేన నాయకుడు ఒకరిని అరెస్ట్ చేశారు. ముస్లిం ప్రధానోపాధ్యాయుడు ఒకరిని అపఖ్యాతిపాలు చేసేందుకు ఒక ప్రభుత్వ పాఠశాలలోని తాగునీటిని విషపూరితం చేసాడని ఆరోపిస్తూ ఆ హెడ్‌మాస్టర్‌ను బదిలీ చేయించాడన్నది శ్రీరామ సేన నాయకుడిపై నమోదైన అభియోగం.భారతీయ ముస్లింలకు వ్యతిరేకంగా విద్వేష ప్రసంగాలు పెచ్చరిల్లిపోవడం క సాధారణ విషయమైపోయింది. అయితే అల్పసంఖ్యాకులలో అల్పసంఖ్యాకులు అయిన భారతీయ క్రైస్తవులతో భారతీయ జనతా పార్టీ సంక్లిష్ట సంబంధాల గురించిన మాటా మంతీ దేశ ప్రజలలో తక్కువే. జూలై 26న బీజేపీ పాలనలో ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ పోలీస్ స్టేషన్‌లో కేరళకు చెందిన ఇద్దరు క్రైస్తవ సన్యాసినులను నిర్బంధించారు. అమ్మాయిల అక్రమ రవాణా, బలవంతంగా మత మార్పిడులకు పాల్పడ్డారన్నది ఆ నన్స్‌పై నమోదైన ఆరోపణ. ఆ గిరిజన ప్రాంతానికి చెందిన స్థానిక బజరంగ్‌దళ్ నేతలు అరెస్టయిన క్రైస్తవ సన్యాసినులపై ఆ తప్పుడు ఆరోపణలు చేశారు. అక్రమ రవాణాకు గురయ్యారని చెప్పుతున్న అమ్మాయిలు తాము స్వచ్ఛందంగానే కేరళ నన్స్ వెంట వెళ్లామని, నర్సింగ్ వృత్తిలో శిక్షణ పొందాలని తాము ఆకాంక్షించామని కూడా వారు స్పష్టం చేశారు. మెరుగైన ఉద్యోగావకాశాలను అన్వేషించుకునేందుకు తమ కుమార్తెకు అనుమతిచ్చామని ఆ అమ్మాయిల తల్లిదండ్రులు కూడా చెప్పినట్టు నమోదయింది. అయినప్పటికీ దుర్గ్ గిరిజన ప్రాంత పోలీసులు ఈ వాస్తవాలను ఉద్దేశపూర్వకంగా ఉపేక్షించారు. స్థానిక బజరంగ్‌దళ్ నాయకుడి ఫిర్యాదు మేరకే ఆ క్రైస్తవ సన్యాసినులను అరెస్ట్ చేశారు. ఆ నన్స్‌కు మద్దతు తెలుపుతున్న వ్యక్తులను బజరంగ్‌దళ్ నేత జ్యోతిశర్మ బెదిరించినట్టు, కొంత మందిపై చేయి చేసుకున్నట్టు కూడా పూర్తి సాక్ష్యాధారాలతో వార్తలు వెలువడ్డాయి. అయినప్పటికీ పోలీసులు, బజరంగ్‌దళ్‌నే ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి సమర్థించారు.ఇవేవీ ఆశ్చర్యకరమైన విషయాలు కాదు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో నేను ఛత్తీస్‌గఢ్‌లో పర్యటించాను. నారాయణపూర్ జిల్లాలోని ఒక చిన్న గ్రామంలో గిరిజనుల బృందం ఒకదానితో మాట్లాడాను. హిందుత్వవాదులు తమను సామాజికంగా బహిష్కరించారని, తదాది తాము భయంతో బతుకుతున్నామని ఆ గిరిజనులు చెప్పారు. చివరకు తమ కుటుంబాలలో చనిపోయిన వారిని ఖననం చేసేందుకు కూడా అనుమతినివ్వడం లేదని వారు వాపోయారు. తిరిగి హిందూ మతంలోకి మారేంతవరకు తమను సామాజికంగా బహిష్కరిస్తామని హిందుత్వవాదులు అంటున్నారని వారు చెప్పారు. క్రైస్తవ గిరిజనుల 'ఘర్%–%వాప్సి' కార్యక్రమాన్ని సంఘ్ పరివార్ చాలా సంవత్సరాలుగా సువ్యవస్థితంగా నిర్వహిస్తోంది. మిషనరీలు ప్రలోభాలతో గిరిజనులను బలవంతంగా క్రైస్తవంలోకి మార్చుతున్నందుకు వ్యతిరేకంగా క్రైస్తవ గిరిజనులను సామాజిక బహిష్కరణతో తిరిగి హిందూ మతంలోకి తీసుకువచ్చేందుకు సంఘ్ పరివార్ అనుబంధ సంస్థ వనవాసి కల్యాణ్ కేంద్రాలు కృషి చేస్తున్నాయి.ఒభారత పౌరులకు మత స్వేచ్ఛ రాజ్యాంగబద్ధమైన హక్కు. తమకు ఇష్టమైన మతంలోకి మారే స్వేచ్ఛ అందులో భాగమే. బాబాసాహెబ్, ఆయన అనుయాయులు బౌద్ధ మతంలోకి మారారన్న విషయాన్ని మనం విస్మరించకూడదు. అయితే రాజ్యాంగ హక్కులు సంపూర్ణమైనవి కావు. ఇతర కారణాల దృష్ట్యా వాటిని ఎంపిక చేసి తగ్గించవచ్చు. ఈ దృష్ట్యా క్రైస్తవానికి మార్పిడిని బలవంతంగా జరిగినదిగా, అదొక నేరపూరిత చర్యగా పరిగణిస్తున్నారు. అయితే హిందూ మతంలోకి మళ్లీ మారడాన్ని స్వచ్ఛంద చర్యగా కొత్త జీవితానికి ఆశీర్వాదంగా భావిస్తున్నారు. అధికారంలో ఉన్న ప్రభుత్వాల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తున్న కారణంగానే బజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు తమ ఇష్టారాజ్యంగా, నిర్భీతితో వ్యవహరించడం మామూలైపోయింది. భయపూరిత వాతావరణాన్ని సృష్టించి పోలీసుల మద్దతుతో ఘర్%–%వాప్సి కార్యక్రమాన్ని అమలుపరుస్తున్నారు.అనూహ్యంగా కేరళ క్రైస్తవ సన్యాసినులకు బెయిల్ మంజూరయింది. కేరళ ఎంపీలు కొంతమంది హోం మంత్రి అమిత్ షాను కలుసుకుని ఆ వ్యవహారంలో తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరడంతో ఆ బెయిల్ మంజూరు సుసాధ్యమయింది. కేంద్ర హోం శాఖ చాలా వేగంగా ప్రతిస్పందించింది, సందేహం లేదు. ఆ క్రైస్తవ సన్యాసినుల అరెస్ట్ కేరళలో రాజకీయ ఉద్రిక్తతలకు కారణం కావడం వల్లే అమిత్ షా ఎంపీలు అడిగిన వెన్వెంటనే జోక్యం చేసుకున్నారు. కేరళలో క్రైస్తవ జనాభా అధికంగా ఉన్నది. అందునా ఆ రాష్ట్రంలో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగ నున్నాయి. కేరళలో ఎలాగైనా అధికారంలోకి రావడానికి బీజేపీ ఆరాటపడుతోంది

## ఘనంగా 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 15ఆగస్టు సంగారెడ్డి జిల్లా: నారాయణ ఖేడ్ నియోజకవర్గంలో నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలో నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టీస్ కమిషన్ రాష్ట్ర కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు కృష్ణ, జిల్లా చైర్మన్ రాజ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ మైనుద్దీన్ ఖురేషి, నారాయణఖేడ్ డివిజన్ అధ్యక్షులు ఎస్ నర్సింహులు ఆధ్వర్యంలో ఘనంగా 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టీస్ కమిషన్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ రహీం తెలంగాణ రాష్ట్ర కార్యాలయం నారాయణఖేడ్లో జాతీయ పథకాన్ని ఆవిష్కరించారు. ఇట్టి కార్యక్రమంలో వైస్ చైర్మన్ వై పండరి, రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ గౌస్ చిస్తీ, కంగ్టి మండల అధ్యక్షులు శ్రీనివాస్,నాగల్గిద్ద మండల అధ్యక్షులు వినోద్ కుమార్, నిజాంపేట్ మండల అధ్యక్షులు దుర్గయ్య,న్యాల్ కల్ మండల అధ్యక్షులు నవీన్,న్యాల్ కల్ మండల ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాల మర్వెల్లి లో 79వ, స్వతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా




సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 15ఆగస్టు సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల్ ప్రాథమిక పాఠశాల మర్వెల్లి 79వ గణతంత్ర దినోత్సవ వేడుకలు పాఠశాల ఉపాధ్యాయుడు నర్సింలు వారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి, గ్రామ పెద్దలు, యువకులు, పాఠశాల %ూూూాజ% చైర్మన్. కే రాణి, గ్రామ యువకులు, మీడియా ప్రతినిధులు. టీ శ్రీశైలం , పి రాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆటలు, నృత్యగీతాలు, వకృత్వ పోటీలు నిర్వహించడం జరిగింది. విద్యార్థులు ఆటపోటీలలో గెలుపొందిన వారికి, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, యువకులు బహుమతులు బహుకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువకులు, గ్రామ నాయకులు, తదితరులు పాల్గొన్నారు



## సీనియర్ ఐపీఎస్ అధికారి 'కిల్లాడ'కు రాష్ట్రపతి సేవా పతకం

### స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రకటించిన కేంద్ర హోం శాఖ

### ప్రస్తుతం యూపీలో అదనపు డీజీపీ హోదాలో పనిచేస్తున్న సత్యనారాయణ



ఆగస్టు 15(సందేశం టైమ్స్):మండలంలోని పాములవాకకు చెందిన ఉత్తరప్రదేశ్ కేడర్ సీనియర్ ఐపీఎస్ అధికారి కిల్లాడ సత్యనారాయణ రాష్ట్రపతి సేవా మెడల్‌కు ఎంపికయ్యారు. ఈ మేరకు సాయంత్రం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. సత్యనారాయణ 1997లో సివిల్ సర్వీసెస్ ద్వారా ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. అంతకుముందు నర్సీపట్నం మండలం బలిఘట్టం పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేశారు. ఐపీఎస్ శిక్షణ అనంతరం ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించారు. తొలుత ఆగ్రా ఏఎస్పీగా పోస్టింగ్ పొందారు. ఒకవైపు పోలీసు అధికారిగా విధులు నిర్వర్తిస్తూనే మరోవైపు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సివిల్స్, పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు కెరీర్‌గైడెన్స్ శిక్షణ ఇచ్చేవారు. చంబల్‌లోయలో బందిపోట్లను కట్టడి చేయడం, వారాణసి డీఐజీగా శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేశారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు (2014–19) ఏపీకి డిప్యూటేషన్‌పై వచ్చి అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్‌గా పనిచేశారు. నర్సీపట్నంలో స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఇప్పించారు. పాములవాక ఉన్నత పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషిచేశారు. నర్సీపట్నం గ్రంథాలయానికి ఏటా రూ.50–60 వేల విలువ చేసే ఉద్యోగ పోటీపరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఉత్తరప్రదేశ్ రాష్ట్ర రవాణా శాఖ అదనపు డీజీపీగా సేవలు అందిస్తున్నారు.

## హార్టికల్చర్‌కు అధికారుల కొరత



ఆగస్టు 15(సందేశం టైమ్స్)::ఉద్యాన శాఖలో అధికారుల కొరత కారణంగా రైతులకు సకాలంలో సేవలు అందడంలేదు. ఒక పక్క ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుకు పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు అందిస్తుంటే.. మరోవైపు ఆ శాఖలో పూర్తిస్థాయిలో అధికారులు లేకపోవడం పథకాల అమల్లో తీవ్ర జాప్యం జరుగుతున్నది. ప్రత్యేకించి చోడవరం, మాడుగుల నియోజకవర్గాలకు రెగ్యులర్ హార్టికల్చర్ అధికారులు కొరత ఉద్యాన రైతులకు శాపంగా మారింది. చోడవరం క్లస్టర్ ఉద్యాన శాఖకు మూడేళ్లుగా రెగ్యులర్ హెచ్‌వో లేరు. ఈ క్లస్టర్ పరిధిలో చోడవరం, బీడికాడ, బుచ్చెయ్యపేట మండలాలు ఉన్నాయి. ఇక్కడ హెచ్‌వోగా పనిచేసిన గణేశ్ మూడేళ్ల క్రితం పదోన్నతిపై పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఐటీడీఏకు వెళ్లిపోయారు. అప్పటి నుంచి చోడవరానికి రెగ్యులర్ హెచ్‌వో లేరు. మాడుగుల హెచ్‌వో భానుపుష్పలీల... చోడవరం క్లస్టర్‌కు ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో చోడవరానికి రెగ్యులర్ హెచ్‌వోను నియమించినప్పటికీ ఆమె ఇక్కడ బాధ్యతలు చేపట్టకుండానే విజయనగరం జిల్లా ఎస్.కోటకు బదిలీపై వెళ్లిపోయారు. ఇక మాడుగుల హెచ్‌వో భానుపుష్పలీల భీమిలికి బదిలీకావడంతో అక్కడకు వెళ్లిపోయారు. అప్పటి నుంచి మాడుగుల, చోడవరం క్లస్టర్లకు ఇన్‌చార్జిలే దిక్కు అయ్యారు. ప్రస్తుతం మాడుగుల క్లస్టర్‌కు దేవరాపల్లి హెచ్‌వో, చోడవరం క్లస్టర్‌కు అనకాపల్లి హెచ్‌వో ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. మాడుగుల క్లస్టర్ పరిధిలో మాడుగుల, రావికమతం మండలాలు ఉన్నాయి. దేవరావల్లి హెచ్‌వో దేవరావల్లి, కె.కోటపాడు మండలాలతోపాటు మాడుగుల, రావికమతం మండలాలను పర్యవేక్షించాల్సి రావడం ఉద్యాన శాఖ కార్యక్రమాల అమలులో జాప్యం జరుగుతున్నది. చోడవరం ఇన్‌చార్జి హెచ్‌వో చోడవరం, బీడికాడ, బుచ్చెయ్యపేట మండలాలతోపాటు అనకాపల్లి, అనకాపల్లి ఫారం, కశింకోట మండలాలను పర్యవేక్షించాల్సి వస్తున్నది. జిల్లాలో 24 మండలాలకుగాను ప్రస్తుతం ఐదుగురు హెచ్‌వోలు మాత్రమే వున్నారు. ఉద్యాన శాఖ అధికారులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో రైతులకు సకాలంలో ప్రభుత్వ సేవలు అందని పరిస్థితి నెలకొంది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఉద్యానవనానికి పెద్దపీట వేయడంతోపాటు, ఆయా పంటలు, తోటల సాగుకు ప్రోత్సాహకాలతోపాటు, రాయితీలు కూడా ఇస్తున్నది. బిందు, తుంపర సేద్యం పరికరాలకు రాయితీలు పెంచింది. జిల్లాలో వాణిజ్యపరంగా ఉద్యాన పంటల సాగుకు అవసరమైన ప్రణాళికలు కూడా రూపొందించింది. దీంతో ఉద్యాన పంటల సాగుకు రైతులు ముందుకు వస్తున్నారు.


# మహనీయుల త్యాగాలు మరువకూడదు..



## - స్వాతంత్ర్య ఫలాలు అందరి - దేశాభివృద్ధిలో యువతే కీలకం - నైతిక విలువలు కోల్పోతే సమాజమే సమాధి - స్వాతంత్ర్య సమరయోధులు పెడబల్లె బాలయల్లారెడ్డి

చెన్నూరు(కడప):ఆగస్టు 15(సందేశం టైమ్స్): ప్రాణాలను తృణప్రాయంగా పెట్టి మనకు స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయుల త్యాగాలు మరిచిపోకూడదని, ఈ నాటి స్వేచ్ఛ వారి త్యాగాల ఫలితవే అని స్వాతంత్ర్య సమరయోధుడు పెడబల్లె బాలయల్లారెడ్డి అన్నారు. జిల్లాలో ప్రస్తుతం జీవించి ఉన్న ఏకైక స్వాంత్ర్య సమర యోధుడు ఈయనే. 105ఏళ్ల వయసులో కూడా స్వాతంత్ర్య దినోత్సవం వచ్చిందంటే ఆయనలో ఎక్కడ లేని ఆనందం, భావోద్వేగం కనిపిస్తాయి. ఆయనను పలకరించగా.. నాటి స్మృతులు, పడ్డ కష్టాలు, యువకునిగా అప్పట్లో తాను బ్రిటీషు వారి ఆగడాలను ఎదుర్కోవడానికి తనతోటి స్వాతంత్ర్య సమరయోధులతో కలిసి చేసిన పనులు చెప్పుకొచ్చారు. నాటి అనుభవాలు, నేటి దేశ పరిస్థితి గురించి ఆయన మాటల్లోనే..బ్రిటీషు వారితో పెద్ద పోరాటాలు చేయకపోయినా మావంతుగా దేశం కోసం తెల్ల దొరలను కొంతమేర ఎదిరించి వారి పనులకు అడ్డుకట్ట వేయించాము. మండలంలో మొత్తం 18 మంది స్వాతంత్ర్య సమరయోధులు ఉండేవారు. 1943-44 ప్రాంతంలో చెన్నూరులో ఉన్న పెన్నా లోలెవల్ కాజ్‌వే మీదుగా బ్రిటీషు వారు రాకపోకలు సాగించకుండా రెండు చోట్ల కాజ్‌వేను పగలగొట్టాం. అప్పట్లో పెన్నాపై హైలెవెల్ వంతెన ఉండేది కాదు. కడప నుంచినంద్యాల, కర్నూలు, హైదరాబాదు వెళ్లాలంటే ఈ చెన్నూరు వద్ద గల లోలెవల్ కాజ్‌వే దాటి వెళ్లాలి. అందుకే వారిని కడప వైపు రానివ్వకుండా కాజ్‌వేపైన రెండు చోట్ల పగలకొట్టి పెద్ద పెద్ద రాళ్లు తొలగించాం. దీంతో బ్రిటీషువారు కోపంతో మమ్మల్ని పట్టుకోవాలని జైల్లో పెట్టాలని ప్రయత్నించగా ఇతర సమరయోధులు, యువత కలిసి వారిని అడ్డుకున్నారు. అలా దేశం కోసం నావంతుగా చిన్నపాటి సాయమందించా. దేశభక్తి నూరిపోసేవారు దేశాభివృద్ధిలో నాటి నుంచి నేటి వరకు యువతే కీలకం. నాడు పెద్దలు దేశభక్తి గీతాలు, చరిత్రలు, గొప్పగొప్ప వారి కథలు చెబుతుంటే విని యువ రక్తం పొంగి బ్రిటీషు వారిపై తిరగబడ్డారు. యువతలో ప్రేరణ కలిగించేందకు ఎందరో గొప్ప గొప్ప వారి చరిత్రలు ఊరు వాడ వినిపించేవారు. పైగా మదనపల్లెలాంటి ప్రాంతాల నుంచి గొప్ప వ్యక్తులు వచ్చేవారు. దూర ప్రాంతాల నుంచి కూడా చెన్నూరుకు వచ్చి రాత్రివేళ దేశభక్తి గురించి యువతలో నూరి పోసేవారు. అందుకే యువత ఉత్తేజితవై బ్రిటీషు వారిని ఎదుర్కోగలిగాం. స్వాతంత్ర్య ఫలాలు అందరి స్వాతంత్ర్యం కోసం కులమత జాతి భేదం లేకుండా పోరాడాం. ఈ పోరాటంలో ఎందరో పాల్గొన్నారు. వారి పోరాట ఫలితమే నేటి స్వాతంత్ర్య ఫలాలి. అందుకే అవి కొందరివి కాదు అందరివీ. అందరికీ సమానంగా అందాలి. అయితే నేడు కులం, ాతిలాంటివే సమాజాన్ని నడిపించే పరిస్థితి రావడం బాధ కలిగిస్తుంది. ఇది మంచి పద్ధతికాదు, దేశాభివృద్ధికి అడ్డంకి.దండలు - దండాలతోనే సరి జిల్లాలో జీవించి ఉన్న సమరయోధుడు పెడబల్లె బాలయల్లారెడ్డి ఒక్కరే. ఆగస్టు 15 వచ్చినప్పుడల్లా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు రావడం శాలువాలు కప్పడం, మెడలో పూలదండలు వేయడం, నమస్కారాలతో సరిపెడుతున్నారు. ఒక్కగానొక్క సమరయోధుడు జీవించి ఉన్నాడు. ఆయన కుటుంబానికి కాస్తంత ఆసరా కల్పిస్తాం అన్న ఆలోచన మాత్రం నేటికీ ఎవరికీ లేదు. ఇంటిస్థలం ఇవ్వాలంటూ ఎన్నోమార్లు ఆయన విన్నవించగా 6 సెంట్ల స్థలం.. అదీ చలమారెడ్డిపల్లె గుట్టమీద ఇచ్చారు. 100 సంవత్సరాలు దాటిన వ్యక్తికి గుట్టమీద స్థలం ఇస్తే ఎలా..? గుట్టమీద కాకుండా ఊర్లో లేదా ఊరికి సమీపంలో స్థలం ఇవ్వాలని స్వాతంత్ర్య సమరయోధుడు కోరుతున్నారు.ప్రజలు నైతిక విలువలు కోల్పోతే సమాజమే సమాధి అవుతుంది. ఎవరిలో అయితే, ఎక్కడైతే నైతిక విలువలు ఏమాత్రం దిగజారకుండా ఉంటాయో అక్కడ అబివృద్ధి ఉంటుంది. నీతి నిజాయితీ నిండి ఉంటాయి. నేడు టీవీల్లో నేతల ప్రసంగాలు, అప్పుడప్పుడూ ప్రచారాలు చూస్తున్నా.. ఏమిటివి? దేశానికి ఉపయోగపడేవేనా అన్న విధంగా మనసుకు అనిపిస్తుంటుంది. వాస్తవ పరిస్థితుల్లో సమాజం మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. నాయకుల మాటలతో మభ్య పెట్టకుండా చేతలతో అభివృద్ధిని చూపిస్తూ దేశం కోసం పాటుపడాలి. అంతర్గత శత్రువులు నాటి నుంచి నేటి వరకు ఉంటున్నారు. వారిని నిర్దాక్షిణ్యంగా ఏరివేయాలి. అటువంటి వారు ఎవరైనా సరే ఉపేక్షించరాదు. యువత అన్నివిధాలుగా చైతన్యవంతులు కావాలి. దేశ సమగ్రతకు బాటలు వేయాలి. జిల్లా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు.

# హత్య కేసులో ఇద్దరి అరెస్టు




బొండపల్లి, ఆగస్టు 15(సందేశం టైమ్స్):కెరటాం గ్రామంలో ఈనెల 9న నెడుగట్టి అప్పలకృష్ణ(45) హత్య కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్టు గజపతినగరం సీఐ జీఏవీ రమణ తెలిపారు.స్థానిక పోలీసులు స్టేషన్‌లో నిందితులను మీడియా ముందు హాజరుపరిచారు. సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అప్పలకృష్ణ భార్య నెడుగట్టి రాజుతో అదే గ్రామానికి చెందిన వరుసకు మేనల్లుడు అయిన నారపాటి సాయితో వివాహేతర సంబంధం ఉంది. దీంతో అప్పలకృష్ణను అడ్డు తొలగించుకునేందుకు హత్య చేసినట్టు సాయి అంగీకరించాడు. ఈ కేసులో సాయితో పాటు మృతుడి భార్య రాజును కూడా అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. సీఐ వెంట ట్రైనీ ఎస్ఐ సాయిరాం పడాల్ తదితరులు ఉన్నారు.

# తప్పుల్లేకుండా స్వామిత్ర సర్వే చేపట్టాలి: డీడీవో



బొబ్బిలి రూరల్, ఆగస్టు 15(సందేశం టైమ్స్): తప్పుల్లేకుండా స్వామిత్ర సర్వే చేప ట్టాలని డీడీవో ఎం.కిరణ్‌కుమార్ కోరారు.మండలంలోని కలవరాయిలో స్వామిత్ర సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూసర్వే తరహాలో గ్రామ కంఠాలు, ఇతర స్థలాల్లో నిర్మాణాలు, పశువుల శాలలను డ్రోన్ల సాయంతో స్వామిత్ర సర్వే చేసి గుర్తించి హక్కు పత్రాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో పి.రవికుమార్,కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసెస్టెంట్లు పాల్గొన్నారు. అనంతరం కలవరాయిలో చెత్తనుంచి సంపదకేంద్రాన్ని డీడీవో తనిఖీచేశారు. చెత్త సేక రణ, వేరు చేసే పద్ధతి, వర్మీ కంపోస్ట్ తయారు చేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవో రవికుమార్ ఉన్నారు.ప్రజలకు సురక్షిత తాగు నీరందించాలని డీడీవో కిరణ్‌కుమార్ కోరారు.గురువారం జగన్నా?థపురంలో తాగునీటి వాటర్ ట్యాంకులో క్లోరినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 15 రోజులకొకసారి వాటర్ ట్యాంకులు శుభ్రపరిచి క్లోరినేషన్ చేయించాలని అధికారులకు ఆదేశించారు.

# ముంచిన వాన



## తాళ్లపూడి మండలం వేగేశ్వరపురంలో నీట మునిగిన పాఠశాల

రాజమహేంద్రవరంఆగస్టు 15(సందేశం టైమ్స్)::వాతా వరణం మారింది.. నిన్నటి వరకూ ఉక్కబోతతో ఉక్కిరి బిక్కిరయ్యారు.. అయితే బుధవారం మధ్యాహ్నం నుంచి వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందుతున్నారు. చల్లదనాన్ని ఆస్వాదిస్తున్నారు. ఉదయం నుం చి సాయంత్రం వరకు వాతావరణం చల్లగానే ఉంది. బుధవారం పలు ప్రాంతాల్లో మొత్తం 957 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా సరాసరి వర్షపాతం 50.4 మిల్లీ మీటర్లు. ఉంద్రాజవరం మండలంలో ఉదయం 8.30 గంటల వరకూ ఏకంగా 180.6 మిల్లీమీటర్లు, పెరవలిలో 170.6, నల్లజర్లలో 120 మిల్లీ మీటర్లు అత్యదిక వర్షపాతం నమోదైంది. గోపాలపురం మండలంలో 8.2 మిల్లీమీటర్ల అతి తక్కువ వర్షపాతం నమోదైంది. కొద్దిపాటి వర్షానికి పల్లపుప్రాంతాలు జలమయమయ్యాయి. భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ పి.ప్రశాంతి జిల్లా యం త్రాంగాన్ని అప్రమత్తం చేశారు. పల్లపు ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టాలని..ముంపు ముప్పు ఉన్న పాఠశాలలకు సెల వుపై నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం ఆమె జేసీ ఎస్. చిన్నరాము డు, డీఆర్వో టి.సీతారామమూర్తి, ఇతర అధికారులతో కలసి క్షేత్రస్థాయి అధికారులకు దిశానిర్దేశం చేశారు. గోదావరి పరీవాహక ప్రాంతాలు, కాలువలు, చెరువుల వద్ద ముందస్తుగా హెచ్చరిక బోర్డులు పెట్టాలన్నారు. ఏటిగట్ల పటిష్టతపై తనిఖీలు నిర్వహించాలని ఆదేశిం చారు.నష్టాలు అంచనా వేసి కచ్చితమైన గణాంకా లతో 24 గంటల్లోపు నివేదికలు అందజేయాలని ఆదేశిం చారు.ఇప్పటికే జిల్లా,డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో కంట్రోలు రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. రెండు రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షం ఖరీఫ్ సీజన్‌కు మేలు చేస్తుందని జిల్లా వ్యవసాయాధికారి మాధ వరావు తెలిపారు. ప్రస్తుతం వరినాట్లు మునిగినా త్వర గానే తేలిపోతాయన్నారు. ఇంకా మరింత ఎక్కువగా మరిన్ని రోజులు వర్షం పడితే కాస్త ఇబ్బంది అవుతుందని, దానికి అనుగుణం రైతులు చర్యలు చేపట్టాలన్నారు.

# ఆటో కార్మికులను ఆదుకోవాలి




మక్కువ, ఆగస్టు 15(సందేశం టైమ్స్): కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణసౌకర్యంకల్పిస్తుండడంతో ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోతారని, రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో డ్రైవర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు, సీఐ టీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వైనాయుడు డిమాండ్ చేశారు. స్థానిక మెయిన్‌రోడ్డు జంక్షన్ వద్ద ఆటో కార్మికులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. అనంతరం తహసీల్దార్ కె.భరత్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్య క్రమంలో యూనియన్ నాయకులు నరేష్, రామకృష్ణ, దాలయ్య పాల్గొన్నారు.

# కిలోలు 100 ... ధర రూ.8,800



అంతర్వేది, ఆగస్టు 15(సందేశం టైమ్స్):డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలెం మినీ ఫిషింగ్ హార్బరులో వేటకు వెళ్లిన మత్స్యకారులకు అరుదైన భారీ సొర చేప వలకు చిక్కింది. 100 కిలోల పైనే ఉన్న చేపకు వేలం పాట నిర్వహించగా రూ.8,800కు పలికింది.

# రూరల్ ప్రాజెక్టు అంగన్‌వాడీ కమిటీ ఎన్నిక



ఆగస్టు 15(సందేశం టైమ్స్):పాజెక్ట్ అంగన్‌వాడీ యూనియన్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. సుందరయ్య భవన్‌లో ప్రాజెక్టు మహాసభ వీరవేణి అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబీరాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.చంద్రావతి, సిఐటియు జిల్లా కోశాధికారి మలకా వెంకటరమణ పాల్గొన్నారు. కార్యదర్శి ప్రవేశపెట్టిన నివేదికను సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షులుగా టి.రాజా, అధ్యక్ష, కార్యదర్శులుగా కె. వీరవేణి, వీరమణి, కోశాధికారి వరలక్ష్మి, సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్‌గా లక్ష్మి, ఉపాధ్యక్షురాలుగా భవాని, రాజేశ్వరి, అచ్చరత్నం, తనూజ, సహాయ కార్యదర్శులుగా కనక మహాలక్ష్మి, లక్ష్మి, సత్యవేణి, జ్యోతి, కమిటీ సభ్యులుగా దివ్య, సత్య, అమ్మాజీ, సత్యవేణి, అప్పలకొండ, గనిలక్ష్మి, కల్పలత ఎన్నికయ్యారు.



# ఉచిత బస్సుకురైట్..రైట్..!

ఆగస్టు 15(సందేశం టైమ్స్):రాయచోటి జిల్లాలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో మహిళలకు ఇచ్చిన హామీ అమలుకు సిద్ధమైంది. స్త్రీశక్తి పథకం పేరుతో మార్గదర్శకాలను విడుదల చేసింది. ఆర్‌టిసిపై అదనపు ఆర్థిక భారం, మహిళా ప్రయాణికుల సంఖ్య, డ్రైవర్ల, కండక్టర్ల కొరత, రిక్రూట్‌మెంట్ తదితర అంశాలపై ఆర్‌టిసి ఉన్నతాధికారులు మేథోమధనం చేసింది. జిల్లాకు చెందిన ఆర్‌టిసి యంత్రాంగం శుక్రవారం నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రారంభోత్సవానికి మంత్రులు, ఆయా డిపోల పరిధిలోని ఎమ్మెల్యేలను ఆహ్వానించే పనిలో నిమగమైంది. ఏడాదికాలంగా ఉచిత బస్సు పథకం అమలుపై చర్చలు నడుస్తుండడంతోపాటు అనేక భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో కథనం. 56,400 మంది మహిళలకు లబ్ధి జిల్లాలో ప్రతిరోజూ 1.41 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. 40 శాతం మంది మహిళలు ప్రయాణిస్తున్నట్లు గుర్తించారు. ఉచిత బస్సు ప్రయాణం అమలు నేపథ్యంలో 56,400 మందికి చేరుకునే అవకాశం ఉందని గుర్తించారు. పెరగనున్న ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నేపథ్యంలో రూ.45 నష్టపోయే అవకాశం ఉన్నట్లు అంచనా. ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించిన అనంతరం మహిళా ప్రయాణికులు పెరిగే అవకాశం ఉంది. పెరిగి రూ.50 లక్షలకు భారం పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. 480 ఆర్టీసీ బస్సులు సిద్ధం జిల్లా పరిధిలో ఐదు డిపోలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 545 బస్సులు ఉండగా 480 బస్సులను స్త్రీ శక్తి పథకానికి ఏర్పాటు చేశారు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్ సర్వీస్‌లు కింద 480 బస్సులు ఏర్పాటు చేశారు. జిల్లాలో రాయచోటి, రాజంపేట, పీలేరు, మదనపల్లె-1, మదనపల్లె-2 పరిధిలో పల్లె వెలుగు 363, అల్ట్రా పల్లె వెలుగు 27, ఎక్స్‌ప్రెస్ 90 సర్వీసులు ఏర్పాటు చేశారు. ఆధార్ తప్పనిసరి ఆర్‌టిసి బస్సులలో ప్రయాణించే మహిళలు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆధార్ కార్డును తప్పనిసరిగాతమ ఆధార్ కార్డును చూపిస్తేనే జీరో టికెట్ జారీ చేస్తారు. ఆధార్ కార్డు లేకుంటే డబ్బులు చెల్లించి టికెట్ తీసుకోవాలి. స్త్రీ శక్తి పథకం పేరుతో జీరో టికెట్ను జారీ చేయనున్నారు. టికెట్ ఛార్జీ మొత్తాన్ని చూపిస్తూ దాన్ని ప్రభుత్వం రాయితీ ఇస్తున్నట్లు పేర్కొంటూ చెల్లించాల్సిన మొత్తాన్ని రూ.సున్నాగా వస్తుంది. ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేయవచ్చును. అయితే ఇప్పటివరకు ఆర్టీసీ బస్సులు సమయానికి అందుబాటులో లేకపోవడంతో ఆటోలలో ప్రయాణించే వారు. ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం స్వాతంత్ర్య దినోత్సవం రోజున అమలు చేయడంతో ఆటో కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత అమలు జరిగిన తర్వాత ఈ పథకం ఎలా అమలవుతుందో వేచి చూడాలి. అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశాం జిల్లాలో స్త్రీ శక్తి పథకాన్ని అమలు చేసేందుకు ఏర్పాట్లు అన్ని పూర్తి చేశాం. చిన్న పిల్లలకు, వృద్ధులకు, మహిళలకు, పురుషులకు ఎలాంటి బస్సు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. నూతన బస్సులు ఏర్పాటు కూడా నివేదికలు పంపడం జరిగింది. – సి.రాము, ఆర్‌టిసి ఆర్‌ఎం, రాయచోటి.

# జిల్లా అంతటా వర్షాలు



విజయనగరంకోట ఆగస్టు 15(సందేశం టైమ్స్):: బంగాళా ఖాతంలో అల్పపీడన ప్రభావంతో విజయనగరం జిల్లా అంతటా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లా మొత్తంగా సరాసరి 40 మిలీమీటర్ల వర్షం కురిసింది. ఏకధాటి వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మరోవైపు చెరువుల్లోను, పొలాల్లోను నీరు చేరి ఉబాలు ఊపందుకోవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అత్యధికంగా డెంకాడ మండలంల 130.6మి.మీ., పూసపాటిరేగ మండలంలో 87.2, విజయనగరంలో 79.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మరో రెండు రోజులు పాటు వర్షాలు కురిసే అవకాశమున్నందున మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని అధికారులు సూచించారు.

# రహదారి సౌకర్యం కల్పించాలని డోలీ మోతలతో నిరసన



శృంగవరపుకోట ఆగస్టు 15(సందేశం టైమ్స్):మండలంలోని దారపర్తి పంచాయతీ పరిధిలో గల గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో డోలీలతో ర్యాలీని నిర్వహించారు. దారపర్తి, మారిక, డీకేపర్తి, మూలబొడ్డవర పంచాయతీలలో గిరిశిఖర గ్రామాలకు, రోడ్డు సౌకర్యాలు కల్పించాలని, గాదెల లోవ గ్రామం నుంచి మెట్టపాలెం గ్రామం వరకు, డోలి యాత్రతో గిరిజనులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకుడు గౌరీష్ మాట్లాడుతూ 79 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో అంతరిక్షానికి రాకెట్లను పంపిస్తున్నారని, గిరిజన గ్రామాలకు మాత్రం రోడ్లు వేయడం లేదని చెప్పారు. స్కూలుకు పోయి చదువుకోడానికి, అనారోగ్యం పాలైతేను, గర్భిణులను కూడా కొండలు, వాగులు, దాటుకుంటూ డోలీలతో వెళ్లాల్సిన పరిస్థితిని, మార్చాల్సిన పాలకులు, మర్చిపోతున్నందుకు నిరసనగా ఆదివాసులుగా ఈ డోలి ర్యాలీని చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి, డోలీలు లేకుండా చేయాలని ముఖ్యమంత్రికి, ఉప ముఖ్యమంత్రినీ కోరుతున్నామని అన్నారు.

# స్నేహితుని వద్దే రూ.70 లక్షల అపహరణ



మేడికొండూరు ఆగస్టు 15(సందేశం టైమ్స్):ండల పరిధిలో జరిగిన దారి దోపిడి పక్కా పథకం ప్రకారమే జరిగిందని తుళ్లూరు డిఎస్‌పి మురళీకృష్ణ అన్నారు. ఈ మేరకు వివరాలను మేడికొండూరు పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. ఈనెల 4న జరిగిన రూ.70 లక్షల నగదు, కారును అపహరించినట్లు విజయవాడలో నివాసం ఉంటున్న జగదీష్ ఫిర్యాదుపై మేడికొండూరు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. జగదీష్‌కు స్నేహితుడైన రంజిత్ ఈనెల 14న బంగారపు మాల్ ఉందని జగదీష్‌ను నమ్మించి కేజీ రూ.50 లక్షలు చొప్పున రెండు కేజీలు ఉందని చెప్పగా అందుకు జగదీష్ తన వద్ద రూ.70 లక్షలే ఉందని, మిగతావి రెండు రోజుల తర్వాత ఇస్తానని చెప్పడంతో అందుకు రంజిత్ అంగీకరించాడు. సత్తెనపల్లికి డబ్బులు తీసుకొని రమ్మని చెప్పి అక్కడ బంగారపు మాల్ పరిశీలించుకుని డబ్బులు ఇవ్వాలని అన్నారు. అందుకు అంగీకరించిన జగదీష్ తన కారులో సత్తెనపల్లి వచ్చి అక్కడ ఉన్న రంజిత్, మరో ఇద్దరు వ్యక్తులతో మాట్లాడి బంగారపు మాల్‌ను పరిశీలించాడు. వెంటనే రంజిత్ ఈ మాల్ ఎక్కువ కేజీలు ఉందని మనం విజయవాడలో తూకం వేయించుకొని అక్కడ డబ్బులు బంగారం మార్చుకుందామని చెప్పి ఎవరి కారులో వాళ్ళు విజయవాడకు పయనమయ్యారు. మార్గమధ్యంలో ముందు కారులో వెళ్తున్న జగదీష్‌ను రంజిత్ తనకు పరిచయస్తులైన నలుగురితో మేడికొండూరు సమీపంలో అడ్డగించి ఆపారు. కారులో నుంచి ఇద్దరు వ్యక్తులు పోలీస్ దుస్తులలో దిగి జగదీష్‌ను కారులో నుంచి దించి కారును తనిఖీ చేశారు. తాము విజిలెన్స్ అధికారులమని, రూ.70 లక్షలు ఎక్కడివని ప్రశ్నించారు. విజయవాడ వచ్చి ఈ డబ్బుకు లెక్క చూపించుకొని తీసుకెళ్లాలని చెప్పి కారును, డబ్బును తీసుకెళ్లారు. జగదీష్ తన స్నేహితులకు ఈ విషయం తెలిపి వారు రాగానే చుట్టుప్రక్కల వెతికి సత్తెనపల్లి వెళ్లి పోలీసులకు వివరాలు చెప్పారు.

# ఎకరాకు రూ.10 వేల పరిహారమివ్వాలి




కొల్లిపర ఆగస్టు 15(సందేశం టైమ్స్): ముంపు బారిన పడిన పొలాలను వెంటనే అంచనా వేసి నష్టపోయిన ప్రతి ఎకరాకూ రూ.10 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని, దీంతోపాటు మళ్లీ సాగుకు విత్తనాలను ఇవ్వాలని రైతు, కౌలురైతు సంఘాలు డిమాండ్ చేశాయి. వీటిని భూ యజమానితో సంబంధం లేకుండా బాధిత కౌల్దార్లకే ఇవ్వాలని నాయకులు కోరారు. భారీ వానల నేపథ్యంలో మండలంలోని అత్తోట, దంతులూరు, చివలూరు తదితర గ్రామాల్లో పైర్లు ముంపుబారిన పడగా వాటిని రైతు, కౌలురైతు సంఘాల నాయకులు పరిశీలించి కౌల్దార్లతో మాట్లాడారు. ఇప్పటికే రెండుసార్లు వెద పెట్టామని, ఎకరాకు రూ.12 వేలకుపైగా ఖర్చు చేశామని, నీరు త్వరగా పోకపోతే మళ్లీ నాటాల్సి ఉంటుందని కౌల్దార్లు వివరించారు. కౌలు కింద రూ.35 వేలు ఇచ్చామని, అయితే సిసిఆర్‌సి కార్డులు మాత్రం రాలేదని, రాయితీలు, నష్టపరిహారాలు కూడా దక్కడం లేదని చెప్పారు. ఈ సందర్భంగా కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ మునిగిన పొలాలను వ్యవసాయ, రెవెన్యూ శాఖలు యుద్ధ ప్రాతిపదికన నమోదు చేయాలన్నారు. పొలాల్లో అనేక చోట్ల ఆయిల్ ఇంజిన్లు, మోటర్లు మునిగిపోయాయని, వాటికీ నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పొలాల్లోని నీటిని బయటకు పంపించడానికి సత్వర చర్యలు చేపట్టాలన్నారు. పంట కాల్వల్లో నీటి ప్రవాహానికి తూటుకాడ, గుర్రపు డెక్క అడ్డుగా ఉన్నాయని, వెంటనే తొలగించాలని కోరారు. రైతుసంఘం జిల్లా నాయకులు ఎం.శివసాంబిరెడ్డి మాట్లాడుతూ రెండేళ్ల నుండి వానలు, వరదల వల్ల సాగుదార్లు నష్టపోతున్నారని, వారిని అదుకునేందుకు స్థానిక మంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.


# సురక్షితంగా అమరావతి



ఆగస్టు 15(సందేశం టైమ్స్):అవునా..? రాజధాని అమరావతి మునిగిపోయిందా? రెండు రోజుల పాటు కురిసిన వర్షాలకే ముంపునకు గురైందా? సోషల్ మీడియాతో పాటు జగన్ రోతపత్రిక ఇలా దుష్ప్రచారం చేస్తున్నాయి. కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే.. అమరావతిలో కీలక ప్రాంతాలన్నీ సురక్షితంగా ఉన్నాయి. యథాతథంగా రాకపోకలు కొనసాగుతున్నాయి. రాజధాని నిర్మాణ పనులూ జరుగుతున్నాయి. రాజధాని పరిధిలోని కృష్ణాయపాలెం, మందడం, నేలపాడు, లింగాయపాలెం, వెలగపూడి, రాయపూడి, దొండపాడు, ఉద్దండరాయునిపాలెం సహా అన్ని ప్రాంతాలు అత్యంత సురక్షితంగా ఉన్నాయి. వర్షాలకు సాధారణంగా వచ్చే నీటి మడుగులు తప్ప మరింకేమీ లేవు. పంటపొలాల్లో సైతం నీరు నిలవలేదు. కోర్ క్యాపిటల్‌లో ప్రస్తుతం కార్యకలాపాలు నిర్వహిస్తున్న, రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న అన్ని భవనాల వద్ద, రహదారుల వద్ద అక్కడక్కడ నీరు నిలిచిన జాడలు తప్ప మునిగిపోయిన దాఖలాలు కనిపించలేదు

# స్వీట్ షాపులో అగ్నిప్రమాదం





-ఏలూరు స్పోర్ట్స్ ఆగస్టు 15(సందేశం టైమ్స్):ఏలూరు నగరంలోని కన్నయ్య పార్క్ వద్ద గృహలక్ష్మి స్వీట్స్ పేరుతో నిర్వహిస్తున్న స్వీట్ల దుకాణంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సంబంధిత వివరాల ప్రకారం ఏలూరు నగరంలోని కన్నయ్య పార్క్ గృహలక్ష్మి స్వీట్స్ పేరుతో స్వీట్ల దుకాణాన్ని నిర్వహిస్తున్నారు రాత్రి యధావిధిగా దుకాణాన్ని మూసివేసి ఇంటికి వెళ్ళారు. ఉదయం షార్ట్ సర్క్యూట్ కారణంగా స్వీట్ల దుకాణం లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది అప్రమత్తమైన స్థానికులు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మండలం అధికారులు చేశారు. ఆస్తి నష్టం దాదాపుగా రెండు లక్షలు ఉంటుందని ఫైర్ ఆఫీసర్ రామకృష్ణ తెలిపారు

# నిద్రిస్తున్న చిన్నారిని ఈడ్చుకెళ్లిన చిరుత!

## స్థానికులు కేకలు వేయడంతో పొదల్లో వదిలేసి పరుగు

## పాప తలకు, పొట్ట భాగంలో తీవ్ర గాయాలు



ఆత్మకూరు/పెద్దదోర్నాల,ఆగస్టు 15(సందేశం టైమ్స్):శ్రీశైలం సమీపంలోని ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండలం చిన్నారుట్ల చెంచుగూడెంలో చిరుత కలకలం రేపింది. నిద్రిస్తున్న సమయంలో ఓ మూడేళ్ల చిన్నారిని చిరుత పులి ఈడ్చుకెళ్లే ప్రయత్నం చేయగా.. గూడెం వాసులు కేకలు వేయడంతో పొదల్లో వదిలేసి వెళ్లింది. రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటనలో బాధిత పాపకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీశైలానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్నారుట్ల చెంచుగూడెంకు చెందిన కుడుముల అంజయ్య, భార్య లింగేశ్వరి, వారి కుమార్తె అంజమ్మ బుధవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో వచ్చిన చిరుతపులి అంజయ్య పక్కనే నిద్రిస్తున్న అంజమ్మ తలను నోటికి కరుచుకొని అక్కడి నుంచి నెమ్మదిగా వెళ్లసాగింది. ఈ క్రమంలోనే ఆ చిన్నారి ఏడవడంతో తల్లిదండ్రులు ఒక్కసారిగా లేచి.. కర్ర చేతపట్టుకుని కేకలు వేస్తూ దాని వెంటపడ్డాడు. విషయం తెలుసుకున్న గూడెంవాసులు కూడా వారికి తోడయ్యారు. దీంతో కొంత దూరంలో పులి ఆ చిన్నారిని చెట్లపొదల్లో వదిలేసి వెళ్లిపోయింది. ఈ ఘటనలో చిన్నారి తలకు, పొట్ట భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. సున్నిపెంట ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయడంతో ప్రాణాపాయం తప్పింది. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ మహేష్ చిన్నారిని, కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్నారిని మెరుగైన వైద్యం కోసం దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇదిలా ఉండగా తమ గూడేనికి విద్యుత్ సదుపాయం లేకపోవడం వల్లే వన్యప్రాణుల నుంచి ముప్పు వాటిల్లిందని, విద్యుత్ సరఫరా అందించాలని స్థానికులు దోర్నాల-శ్రీశైలం రోడ్డుపై ధర్నా చేపట్టారు. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దోర్నాల పోలీసు, అటవీ అధికారులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు సర్దిచెప్పారు. గూడేనికి విద్యుత్ సరఫరా అందించేలా చొరవ తీసుకుంటామని చెప్పడంతో వారు శాంతించారు.

# చర్లపల్లి-కాకినాడ, నాందేడ్-తిరుపతి వీక్లీ స్పెషల్ రైళ్ల పొడిగింపు



హైదరాబాద్: ఆగస్టు 15(సందేశం టైమ్స్): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా చర్లపల్లి-కాకినాడ నాందేడ్-తిరుపతి మధ్య వీక్లీ స్పెషల్ రైళ్లను పొడిగించినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. చర్లపల్లి-కాకినాడ టౌన్ (07031) ప్రత్యేక రైలు ఈనెల 15, 22, సెప్టెంబర్ 2వ తేదీ(శుక్రవారం)వరకు,%కాకినాడ టౌన్-చర్లపల్లి (07032) ప్రత్యేకరైలు ఈనెల 17, 24, 31 తేదీ(ఆదివారం)వరకు, హెచ్ఎస్.నాందేడ్-తిరుపతి (07015) ప్రత్యేకరైలు (ప్రతి శనివారం) 2026 మార్చి 28వరకు, తిరుపతి-హెచ్ఎస్.నాందేడ్ (07016) ప్రత్యేక రైలు( ప్రతి ఆదివారం) మార్చి 29, 2026 వరకు పొడిగిస్తున్నట్టు పేర్కొన్నారు.

# వికారాబాద్ జిల్లాలో భూప్రకంపనలు



పరిగిఆగస్టు 15(సందేశం టైమ్స్)::పూడూరు: వికారాబాద్ జిల్లా పరిగి, పూడూరు మండలాల్లో తెల్లవారుజామున భూ ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. పరిగి మండలం బసిరెడ్డిపల్లి, రంగాపూర్, న్యామత్‌నగర్, పరిగి, చెన్‌గోముల్ తదితర ప్రాంతాల్లో తెల్లవారుజామున 3.56 గంటలకు భూమి స్వల్పంగా కంపించింది. మూడు, నాలుగు సెకన్ల పాటు కొనసాగిన ఈ ప్రకంపనలతో ఆ సమయంలో నిద్రలో ఉన్న ప్రజలు తీవ్రభయాందోళనలతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. కొందరి ఇళ్లల్లో వంట సామగ్రి కిందపడిందని, శబ్దాలు కూడా వచ్చాయని పలు గ్రామాల ప్రజలు చెబుతున్నారు. పరిగి, పూడూరు మండలాల పరిధిలో భూ ప్రకంపనలు సంభవించిన విషయాన్ని శాస్త్రవేత్తలు ధృవీకరించారు. భూప్రకంపల తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 3.1గా నమోదైంది. పూడూరు మండలం, చన్‌గోముల్ గ్రామ పరిధిలోని రైతు ఎండీ ఖయ్యూం పంటపొలం కేంద్రంగా భూ ప్రకంపనలు చోటు చేసుకోగా, అక్కడ 10 కి.మీ. లోతులో భూమి కంపించినట్లు గుర్తించారు. చన్‌గోముల్ కేంద్రంగా ఏర్పడ్డ భూ ప్రకంపనల ప్రభావంతోనే పరిగి, పూడూరు మండలాల్లోని పలు గ్రామాల్లో స్వల్ప కంపనాలు చోటు చేసుకున్నాయి.సమాచారం అందుకున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, ఆర్డీవో వాసుచంద్ర, డీపీవో జయప్రద, తహశీల్దార్ వెంకటేశ్వరి, ఎంపీడీవో కరీం పరిగి మండలంలోని బసిరెడ్డిపల్లి, రంగాపూర్ గ్రామాలను సందర్శించారు. కలెక్టర్ గ్రామస్తులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కాగా, చన్‌గోముల్ కేంద్రంగా భూ ప్రకంపనలు వెలువడ్డ ప్రాంతానికి దామగుండం నేవీ రాడార్ స్టేషన్ కేవలం 12 కి.మీ. దూరంలోనే ఉంది. ఈ తరుణంలో చన్‌గోముల్ శివారులో 10 కి.మీ. లోతులో భూ ప్రకంపనలు చోటు చేసుకోవడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. నేవీ రాడార్ స్టేషన్‌లో పలు భవనాలను భూగర్భంలో నిర్మించి అక్కడి నుంచి పర్యవేక్షించనున్న నేపథ్యంలో రాబోయే రోజుల్లో ఆ భవనాలు ఎంత మేరకు సురక్షితంగా ఉండే అవకాశం ఉందనే ప్రశ్న తలెత్తుతోంది. భూ ప్రకంపనల నేపథ్యంలో నేవీ రాడార్ స్టేషన్ పరిస్థితి ఏమిటనే చర్చ జరుగుతోంది.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి : అడిషనల్ డీఎంహెచ్ వో



నార్నూర్ ఆగస్టు 15(సందేశం టైమ్స్): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ డీఎంహెచ్ వో కుడ్మెత మనోహర్ వైద్య సిబ్బందికి సూచించారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలిస్తూ, ఆసుపత్రికి వచ్చే రోగులకు అందే వైద్య తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు.%ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న తరుణంలో అపరిశుభ్రత లోపించకుండా , డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రభలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. హై రిస్క్ గర్భిణిలో ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పరిశుభ్రత తోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని విషయాన్ని పల్లెలలో స్థానికులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి జితేందర్ రెడ్డి, హెచ్ఈవో తులసీదాస్, వైద్య సిబ్బంది నాందేవ్, చరణ్ దాస్, సత్యావ్వ , గణేష్ కుమారి, విలాస్, కైలాస్ తదితరులున్నారు.

# పెళ్లి పేరుతో అమ్మాయిల మతం మార్చి హైదరాబాద్‌లో మోసాలకు పాల్పడుతున్న పాకిస్థాన్ యువకుడు ఫహాద్



హైదరాబాద్, ఆగస్టు 15(సందేశం టైమ్స్): ప్రేమ, పెళ్లి పేరుతో అమ్మాయిల మతం మార్చి హైదరాబాద్‌లో మోసాలకు పాల్పడుతున్న పాకిస్థాన్ యువకుడు ఫహద్ ను పోలీసులు అరెస్ట్ చేశారు. హైటెక్ సిటీ దగ్గరున్న సిపాల్ కంపెనీలో పనిచేస్తుండగా పాకిస్థాన్ యువకుడు ఫహద్.. కీర్తి అనే అమ్మాయిని ప్రేమలోకి దింపాడు. హిందూ మతానికి చెందిన కీర్తిని.. దోహా ఫాతిమాగా పేరు, మతం మార్చి 2016 లో పెళ్లి చేసుకున్నాడు. అయితే, మరో యువతిని ప్రేమలోకి దింపే యత్నాల్లో తన భర్త ఉన్నాడని గ్రహించిన ఫాతిమా భర్తను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుంది.బంజారాహిల్స్ మౌంట్ బంజారా కాలనీలో తన భర్త రాసలీలలు సాగిస్తున్నాడన్న విషయాన్ని తెలుసుకున్న ఫాతిమా ఈ ఉదయం అక్కడికి వెళ్లింది. సిపాల్ కంపెనీలో పనిచేసిన మరో మహిళతో రెడ్ హ్యాండెడ్ గా దొరికిపోయాడు పాకిస్థాన్ యువకుడు ఫహద్. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చి భర్తను మరో మహిళను పట్టించింది భార్య దోహా ఫాతిమా. దీంతో పోలీసులు వారిద్దరినీ అదుపులోకి తీసుకొని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.కాగా, ఫహద్.. 1998లో పాకిస్థాన్ నుండి భారత్ వచ్చి హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. అమ్మాయిల మతం కన్వర్ట్ చేసి ప్రేమ పేరుతో, పెళ్లి పేరుతో మోసాలకు పాల్పడుతున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పోలీసులు ఫహద్ పూర్వాపరాలు సేకరిస్తున్నారు.

# నల్లగొండలో గంజాయి స్వాధీనం



నీలగిరి,ఆగస్టు 15(సందేశం టైమ్స్):నల్లగొండ పట్టణంలో గం జాయి సేవిస్తూ, విక్రయిస్తున్న పది మంది యు వకులను ఆరెస్టు చేసి వారి నుంచి 1.65 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి తెలిపారు. నల్లగొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏ ర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాయంత్రం మునుగోడు రోడ్డులో గంజాయి తాగుతున్న ఆరుగురు యవకులను ఆదుపులోకి తీసుకుని వారిని పునరావాస కేంద్రానికి తరలించినట్లు తెలిపారు. అలాగే మిర్యాలగూడ రోడ్డులోని జూబ్లీహిల్స్‌లో గంజాయి అమ్ముతున్న నలుగురు యువకులను అదుపులోకి తీసుకుని వారిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. %స్థానిక హౌసింగ్ బోర్డు సమీపంలో మెగలిపాక నూతన్‌కుమార్, మహ్మ ద్ అసద్, దింగన్ ఆకాశ్, బేద్ లక్కీ సుందర్, మహ్మద్ అజ్మల్ గంజాయి సేవిస్తున్నట్లు సమాచారం రావడంతో వన్‌టౌన్ ఎస్సై గోపాల్‌రావు ఆధ్వర్యంలో పట్టుకున్నట్లు తెలిపారు. ఆదేవిధంగా జూబ్లీహిల్స్ ప్రాంతంలో మహ్మద్ ఇమ్రాన్, పోలిశెట్టి వెంకటేశ్, నలుపరాజు శివ, చిత్ర రమేశ్ గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యం లో పట్టుకున్నట్లు తెలిపారు. ఇరువురు నిందితుల నుంచి 1.65 కేజీల గంజాయిని స్వాధీ నం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.మాదకద్రవ్యాల వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించి, ఉకుపాదంతో అణిచివేస్తామని, ఎంతటి వారినైనా ఉపేక్షించేదిలేదన్నారు. యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, గంజాయి సరఫరా, విక్రయించే వారిపైనే కాకుండా, సేవించే వ్యక్తులపై కూడా చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.గంజాయి, మాదకద్రవ్యాలను సరఫ రా చేసేవారి గురించి సమాచారం తెలిస్తే వెంట నే, డయల్ 100, డయల్ 8712670141 ద్వా రా కానీ లేదా నేరుగా సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు రహస్యంగా ఉంచుతామన్నారు. సమావేశంలో నల్గొండ వన్‌టౌన్ సీఐ వేమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఎస్సై గోపాల్ రావు, సతీష్, ఏఎస్సైలు వెంకటయ్య, వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ రబ్బాని, కానిస్టేబుల్ షకీల్, శ్రీకాంత్, శం కర్, ఆంజనేయులు, లేడీ కానిస్టేబుల్ రమాదేవి, మహేశ్వరి, హోంగార్డులు సైదులు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# ఎస్సీ కాలనీ సమస్యలు పరిష్కరించాలని అధికారులకు వినతి



తాండూరు ఆగస్టు 15(సందేశం టైమ్స్):వర్షం వస్తే జలమయం అవుతున్న బోయపల్లి ఎస్సీ కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు తహసీల్దార్ జ్యోత్స్న, ఎంపీడీవో శ్రీనివాస్‌కు వేరువేరుగా స్థానిక నాయకులతో కలిసి వినతిపత్రాలు అందజేశారు.%ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం వర్షాలు కురిసినప్పుడు వరద నీరు ఇండ్లలోకి చేరి తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. గతంలో ఈ ప్రాంతంలో ఉన్న ఒర్రెను భూమి యజమానులు పూడ్చేశారని అన్నారు. పచ్చిమం వైపున్న కాలువ తిరిగి నిర్మించాలని కోరారు.వర్షపు నీరు, వరద నీరు, మురుగు కాలువల నీరు జాతీయ రహదారి అధికారుల తప్పిదం వల్ల ఎస్సీ కాలనీ జలమయం అవుతున్నదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీ జలమయం కాకుండా చూడాలని కోరారు.




# క్రీడావార్తలు




## సచిన్ తొలి శతకానికి 35 ఏళ్లు

ముంబై: సచిన్ టెండూల్కర్..24 ఏళ్ల సుదీర్ఘ క్రికెట్ కెరీర్‌లో నెలకొల్పిన రికార్డులు ఎన్నో..అందుకున్న ఘనతలు మరెన్నో.. 664 అంతర్జాతీయ మ్యాచ్‌లలో 34,357 పరుగులు, 100 సెంచరీలు. ఈ శతకాలకు పునాది పడింది 35 ఏళ్ల కిందట..1990 ఆగస్టు 14న ఓల్డ్‌ట్రాఫర్డ్ మైదానంలో. తొలి సెంచరీ ఏ క్రికెటర్‌కైనా ఎంతో అపురూపం. పైగా..ఆ శతకం జట్టును ఓటమి కోరలనుంచి తప్పించినదైతే ఆ థ్రిల్లే వేరు కదా! ఇంగ్లండ్‌తో మూడు టెస్టుల సిరీస్‌లో భాగంగా ఓల్డ్‌ట్రాఫోర్డ్ రెండో టెస్టుకు వేదికైంది. ఆ టెస్టు సచిన్‌కు తొమ్మిదవది. ఆ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో 68 పరుగులు చేసిన 17 ఏళ్ల టెండూల్కర్..408 పరుగుల లక్ష్యంతో చివరి రోజు 103/4తో జట్టు క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న దశలో ఆరో నెంబర్‌లో క్రీజులోకి వచ్చాడు.





బంతి రివ్వుమని దూసుకొస్తూ బ్యాటర్లకు దడ పుట్టిస్తోంది. ఈ తరుణంలో దుర్భేద్యమైన డిఫెన్స్ ఆటతో ఇంగ్లండ్ బౌలర్లకు ఎదురొడ్డాడు. ఓ పక్క సహచరులు అవుటవుతున్నా వెరవలేదు. చూడముచ్చటైన బౌండరీలతో ఆకట్టుకొని సెంచరీ సాధించిన సచిన్ (189 బంతుల్లో 17 ఫోర్లతో 119 నాటౌట్) మనోజ్ ప్రభాకర్ (67 నాటౌట్) జతగా మ్యాచ్‌ను డ్రా (343/6) చేయగలిగాడు.

## 45 ఏళ్ల వీనస్‌కు వైల్డ్‌కార్డ్




న్యూయార్క్: లేటు వయసులో యూఎస్ ఓపెన్ సింగిల్స్ వైల్డ్‌కార్డ్ అందుకొన్న ప్లేయర్‌గా అమెరికా వెటరన్ వీనస్ విలియమ్స్ (45) రికార్డులకెక్కింది. ఈ నెల 24 నుంచి జరగనున్న యూఎస్ ఓపెన్‌కు సంబంధించిన వైల్డ్‌కార్డ్ ఎంట్రీలను నిర్వాహకులు ప్రకటించారు. రెండేళ్ల విరామం తర్వాత వీనస్ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ బరిలోకి దిగనుంది. ఈ క్రమంలో 1981లో రెనీ రిచర్డ్స్ (47) తర్వాత సింగిల్స్ వైల్డ్‌కార్డ్ అందుకొన్న పెద్ద వయసు ప్లేయర్‌గా విలియమ్స్ నిలిచింది. పురుషుల సింగిల్స్‌లో భారత సంతతికి చెందిన అమెరికా ఆటగాడు నిశేష్ బసవారెడ్డి (20)కి కూడా వైల్డ్‌కార్డ్ లభించింది. నెల్లూరు జిల్లాకు చెందిన నిశేష్ తండ్రి...మురళీకృష్ణ 1999లో అమెరికా వెళ్లి స్థిరపడ్డారు.

## పెళ్లి పీటలెక్కనున్న అర్జున్



ముంబై: దిగ్గజ బ్యాటర్ సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ టెండూల్కర్ త్వరలోనే పెళ్లి పీటలెక్కనున్నాడు. స్థానిక పారిశ్రామికవేత్త రవి ఘాయ్ మనవరాలు సానియా చందోక్‌తో అర్జున్ (25)కు ఈనెల 11న నిశ్చితార్థం జరిగింది. ముంబైలోని సానియా స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఇరువురి కుటుంబ సభ్యులు మాత్రమే హాజరయ్యారట. అయితే ఈ విషయమై ఇరు కుటుంబాల నుంచి ఎటువంటి ప్రకటనా రాలేదు. మరోవైపు ఈ సానియా గురించి అభిమానులు నెట్టింట తెగ శోధిస్తున్నారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో చదువుకున్న తను పెంపుడు జంతువుల కోసం ముంబైలో స్పా అండ్ స్టోర్‌ను నిర్వహిస్తోంది. అలాగే ప్రపం చ ప్రఖ్యాత బాస్కిన్-రాబిన్స్ ఐస్‌క్రీమ్‌కు సంబంధించి భారత్‌లో వ్యవహారాలను వీరి కుటుంబానికి చెందిన గ్రావిస్ గ్రూప్ చూస్తోంది. ఇంకా బ్రూక్లిన్ క్రీమరీ ఐస్‌క్రీమ్‌తో పాటు ఇంటర్ కాంటినెంటల్ హోటల్స్ కూడా వీరి సొంతమే. రియల్ ఎస్టేట్‌లోనూ రవి ఘాయ్‌కు చెందిన గ్రూప్ ప్రముఖ పాత్ర పోషిస్తోంది.

## నా శిష్యుల్లో కోహ్లీ బెస్ట్




న్యూఢిల్లీ: తాను శిక్షణ ఇచ్చిన టీమిండియా ఆటగాళ్లలో విరాట్ కోహ్లీ అత్యుత్తమ ప్లేయర్ అని రవిశాస్త్రి ప్రశంసించాడు. 2017-2021 వరకు భారత జట్టు కోచ్‌గా శాస్త్రి వ్యవహరించాడు. కోహ్లీ అద్భుత ప్రదర్శన కారణంగానే తన హయాంలో భారత్ టెస్టుల్లో టాప్ టీమ్‌గా నిలిచిందని చెప్పాడు. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్‌లో కొన్ని మ్యాచ్‌ల్లో కోహ్లీ ప్రదర్శన నమ్మశక్యం కాని రీతిలో ఉందన్నాడు. ధోనీ రిటైర్మెంట్ తర్వాత జట్టును నడిపించే నాయకత్వ లక్షణాలు కోహ్లీలోనే చూశానని తెలిపాడు. బ్యాటర్‌గా తన బాధ్యతలు నిర్వహిస్తూనే.. జట్టు గెలుపు కోసం తుదికంటా పోరాడేవాడని కితాబిచ్చాడు.

## ఒలింపిక్స్ హాకీ కాంస్య విజేత లియాండర్ తండ్రి వేస్ పేస్ మృతి

కోల్‌కతా: టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్ తండ్రి, హాకీ మాజీ ఆటగాడు వేస్ పేస్ (80) మరణించాడు. పార్కిన్సన్ వ్యాధితో బాధపడుతున్న వేస్ పేస్‌ను గత మంగళవారం ఇక్కడి ఓ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. విదేశాలలో స్థిరపడిన వేస్ పేస్ కుమార్తెలు వచ్చాక ఆయన అంత్యక్రియలు సోమ లేదా మంగళవారం జరపనున్నట్టు కుటుంబ సభ్యులు వెల్లడించారు. వేస్ పేస్ భార్య జెన్నిఫర్ భారత బాస్కెట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్. భారత క్రీడా రంగంతో వేస్ పేస్‌కు సుదీర్ఘ అనుబంధం ఉంది. మిడ్‌ఫీల్డర్‌గా జాతీయ హాకీ జట్టుకు సేవలందించాడు. 1971 బార్సిలోనా వరల్డ్ కప్, 1972 మ్యూనిచ్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకాలు గెలుపొందిన భారత జట్లలో పేస్ సభ్యుడు. ఫుట్‌బాల్, క్రికెట్, రగ్బీ క్రీడలలోనూ పేస్‌కు ప్రవేశం ఉంది. డివిజన్ స్థాయిలో ఆ మూడు క్రీడలకు అతడు ప్రాతినిధ్యం వహించాడు. 1945లో గోవాలో జన్మించిన వేస్ పేస్



ఆటలతోపాటు చదువులోనూ ఎంతో ప్రతిభావంతుడు. హాకీ నుంచి రిటైర్ అయ్యాక స్పోర్ట్స్ మెడిసిన్ డాక్టర్‌గా మారాడు. ఆసియా క్రికెట్ కౌన్సిల్, బీసీసీఐ, భారత డేవిస్ కప్ జట్టుకు కన్సల్టెంట్ డాక్టర్‌గా వ్యవహరించాడు. కుమారుడు లియాండర్ పేస్‌కు మేనేజర్‌గానూ బాధ్యతలు నిర్వర్తించాడు.

## దయచేసి మాతో ఆడొద్దు

కరాచీ: త్వరలో జరిగే ఆసియాకప్ టీ20 టోర్నీలో భారత జట్టు తమతో మ్యాచ్‌ను బహిష్కరించాలని పాకిస్థాన్ మాజీ ఆటగాడు బాసిత్ అలీ కోరాడు. మంగళవారం జరిగిన మూడో వన్డేలో విండీస్ 202 పరుగుల తేడాతో పాక్‌ను చిత్తుగా ఓడించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో భారత్ చేతిలోనూ తమ జట్టుకు చావుదెబ్బ తప్పదని చెప్పాడు. 'ఆసియాకప్‌లో పాక్‌తో మ్యాచ్ ఆడకుండా భారత్ నిర్ణయం తీసుకోవాలని ప్రార్థిస్తున్నా. ఇటీవలి వరల్డ్ చాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ మాదిరే మా జట్టుతో ఆటను వారు బహిష్కరించాలి. ఎందుకంటే టీమిండియా పాక్



జట్టును ఎంత ఘోరంగా ఓడిస్తుందో ఆలోచిస్తేనే వణుకు పుడుతోంది. అఫ్ఘాన్ చేతిలో ఓడితే ఎవరూ పట్టించుకోరేమో కానీ భారత్‌పై ఓటమిని పాక్‌లో జీర్ణించుకోలేరు' అని బాసిత్ తమ జట్టు ఆటగాళ్ల పేలవ ఫామ్‌పై వ్యంగ్యంగా స్పందించాడు.

## బైపాస్ కాలేదు అడ్డంకి




కోజికోడ్: ఆయన వయస్సు 73 సంవత్సరాలు..ఆరు నెలల కిందటే బైపాస్ సర్జరీ అయ్యింది..సాధారణంగా అంత పెద్ద ఆపరేషన్ అయితే మరెవరైనా విశ్రాంతికే పరిమితమవుతారు..కానీ ఆయన అలా కూర్చోలేదు..అప్పటిదాకా పెద్దగా పరిచయంలేని పవర్‌లిఫ్టింగ్‌లోకి అడుగుపెట్టారు..కోజికోడ్ ఆతిథ్యమిచ్చిన జాతీయ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్స్‌లో ఏకంగా నాలుగు స్వర్ణాలు సాధించి చరిత్ర సృష్టించారు..ఆయనే భద్రాచలానికి చెందిన డీవీ శంకర్ రావు. ఎస్‌బీఐలో ఉద్యోగం చేసి రిటైరైన ఆయన జాతీయ పోటీల 83 కిలోల మాస్టర్-4 విభాగంలో బరిలోకి దిగారు. వ్యక్తిగత విభాగాలలో మూడు, ఓవరాల్ చాంపియన్‌గా మరొకటి కలిపి మొత్తం నాలుగు పసిడి పతకాలు కొల్లగొట్టి అబ్బురపరిచారు. బైపాస్ సర్జరీ అయ్యాక పోటీలలో పాల్గొనడంతోపాటు నాలుగు పసిడి పతకాలు సొంతం చేసుకోవడం జాతీయ పవర్ లిఫ్టింగ్ చరిత్రలో తొలిసారని పవర్ లిఫ్టింగ్ వర్గాలు వెల్లడించాయి.

## ర్యాపిడ్‌లో గుకేష్‌కు 4వ స్థానం




సెయింట్ లూయిస్ (యూఎస్): వరల్డ్ చెస్ టూర్‌లో భాగంగా జరుగుతున్న సెయింట్ లూయిస్ ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ టోర్నీలో ర్యాపిడ్ రౌండ్‌లు ముగిసే సరికి వరల్డ్ చాంపియన్ గుకేష్ దొమ్మరాజు నాలుగో స్థానంలో నిలిచాడు. 9 రౌండ్ల ర్యాపిడ్‌లో గుకేష్ నాలుగు గేమ్‌లు గెలిచి.. రెండు గేమ్‌లను డ్రా చేసుకొన్నాడు. మొత్తం 10 పాయింట్లతో నాలుగో స్థానం దక్కించుకొన్నాడు.

# బిజినెస్



## భారత్ రేటింగ్ పెంపు




న్యూఢిల్లీ: భారత్ మృత ఆర్థిక వ్యవస్థ అని నోరు పారేసుకున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఆ దేశానికే చెందిన ప్రముఖ అంతర్జాతీయ పరపతి రేటింగ్ సంస్థ 'ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్' గట్టి సమాధానం ఇచ్చింది. దీర్ఘకాలిక దృష్టితో చూస్తే భారత ఆర్థిక వ్యవస్థ పునాదులు చాలా పటిష్ఠంగా ఉన్నట్టు తెలిపింది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని భారత దేశ సార్వభౌమ పరపతి రేటింగ్‌ను 'బీబీబీ మైనస్' స్థాయి నుంచి 'బీబీబీ' స్థాయికి పెంచుతున్నట్టు ప్రకటించింది. గత 18 సంవత్సరాల్లో ఈ సంస్థ మన దేశ పరపతి రేటింగ్‌ను పెంచడం ఇదే మొదటిసారి. ట్రంప్ సుంకాల పోటు ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ స్థిరంగా, హుషారుగా ఉన్నట్టు తెలిపింది. ఈ పరపతి రేటింగ్ పెంపుతో కేంద్ర ప్రభుత్వం, ప్రైవేటు కంపెనీలు తక్కువ వడ్డీకే విదేశాల నుంచి రుణాలు, నిధులు సమీకరించగలుగుతాయని భావిస్తున్నారు.ట్రంప్ సుంకాల కత్తి వేలాడుతున్నా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ వృద్ధి రేటుకు ఎలాంటి ఢోకా ఉండదని ఎస్ అండ్ పీ గ్లోబల్ అంచనా. గత ఆర్థిక సంవత్సరంలోలానే ఈ ఆర్థిక సంవత్సరం కూడా భారత ఆర్థిక వ్యవస్థ 6.5 శాతం వృద్ధి రేటు నమోదు చేస్తుందని తెలిపింది. తగ్గుతున్న వడ్డీ రేట్లు, ద్రవ్యోల్బణం ఇందుకు దోహదం చేస్తాయని పేర్కొంది.పరపతి రేటింగ్ పెంపు విదేశాల నుంచి మన దేశం మరిన్ని పెట్టుబడులు ఆకర్షించేందుకూ దోహదం చేయనుంది. ఈ రేటింగ్ పెంపుతో మన దేశ మధ్య, దీర్ఘకాలిక అవకాశాలపై దేశ, విదేశీ పెట్టుబడిదారులకు మరింత నమ్మకం ఏర్పడనుంది. దీంతో ఎఫ్‌పీఐలతో పాటు విదేశీ కంపెనీలూ మన దేశంలో మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తాయని భావిస్తున్నారు. ట్రంప్ సుంకాలతో అనిశ్చితిలో పడిన భారత ఆర్థిక వ్యవస్థకు ఈ పరపతి రేటింగ్ పెంపు పెద్ద ఊరట అని మద్రాస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ డైరెక్టర్ ఎన్ఆర్ భానుమూర్తి చెప్పారు. ఈ రేటింగ్స్ ప్రభావం ఫారెక్స్ మార్కెట్లో రూపాయి మారకం రేటు స్థిరపడేందుకూ దోహదం చేస్తుందని ఆర్థిక నిపుణుల అంచనా. డొనాల్డ్ ట్రంప్ అధికార పగ్గాలు చేపట్టిన మూడు నెలలకే అంటే మే నెలలో మూడీస్ రేటింగ్స్.. అమెరికా పరపతి రేటింగ్‌ను ట్రిపుల్ ఏ నుంచి డబుల్ 'ఏ'కు తగ్గించింది. అంతకుముందు ఫిచ్ రేటింగ్స్ కూడా 2023 ఆగస్టులో అమెరికా పరపతి రేటింగ్‌ను ట్రిపుల్ ఏ రేటింగ్ నుంచి డబుల్ ఏ రేటింగ్‌కు తగ్గించింది. అప్పటి నుంచే అమెరికాలో వడ్డీ రేట్లు గణనీయంగా పెరిగాయి. తాజాగా ట్రంప్ సుంకాల పోటు, అర్థంపర్థం లేని ఆర్థిక విధానాలతో అమెరికా ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి వెళ్లే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## స్థిరంగా బంగారం ధర.. ఈ రోజు మీ నగరంలో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..



భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారం ధరలు ఇటీవల ఆల్‌టైమ్ గరిష్టానికి చేరువ అయ్యాయి . అయితే ప్రస్తుతం మళ్లీ క్రమంగా కిందికి దిగివస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ రోజు (ఆగస్ట్ 15న) 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 01, 340కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 92, 890కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే బంగారం ధరల్లో మార్పు లేదు.ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 01, 490కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 93, 040కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 01, 340కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 92, 890కి చేరింది. వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే వంద రూపాయల మేర పెరిగాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.

## జూలై ఎగుమతుల్లో 7 శాతం వృద్ధి




న్యూఢిల్లీ: ఎగుమతుల రంగం రెండు నెలల క్షీణతకు స్వస్తి పలికింది. జూలైలో ఎగుమతులు 7.29 శాతం వృద్ధితో 3,724 కోట్ల డాలర్లుగా (రూ.3.24 లక్షల కోట్లు) నమోదయ్యాయి. ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, వజ్రాభరణాలు, ఫార్మా, కెమికల్స్ రంగాలు ఈ వృద్ధికి ఊతం ఇచ్చాయి. అదే సమయంలో వాణిజ్య లోటు మాత్రం 8 నెలల గరిష్ఠస్థాయి 2,735 కోట్ల డాలర్లకు (రూ.2.38 లక్షల కోట్లు) దూసుకుపోయింది. గత ఏడాది నవంబరులో నమోదైన వాణిజ్య లోటు 3,177 కోట్ల డాలర్ల (రూ.2.76 లక్షల కోట్లు) తర్వాత నమోదైన గరిష్ఠ స్థాయి ఇదే. గురువారం వాణిజ్య శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం దిగుమతులు 8.6% వృద్ధితో 6,459 కోట్ల డాలర్లకు (రూ.5.62 లక్షల కోట్లు) చేరాయి.ట్రంప్ సుంకాల నేపథ్యంలోనూ భారత్–అమెరికా దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం పెరుగుతోంది. జూలైలో మన దేశం అమెరికాకు 801 కోట్ల డాలర్ల విలువైన సరుకులు ఎగుమతి చేసి,..ఆ దేశం నుంచి 455 కోట్ల డాలర్ల విలువైన సరుకులు దిగుమతి చేసుకుంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే జూలైలో భారత ఎగుమతులు 19.94 శాతం పెరగగా, దిగుమతులు 13.78 శాతం పెరిగాయని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లోనూ అమెరికాకు మన ఎగుమతులు 21.64 శాతం పెరిగి 3,353 కోట్ల డాలర్లకు చేరాయి. ఆ దేశం నుచి మన దేశానికి వచ్చే దిగుమతులూ 12.33 శాతం పెరిగి 1,741 కోట్ల డాలర్లకు చేరాయి.

## కాగ్నిజెంట్‌లో 80 శాతం సిబ్బంది జీతం పెంపు

న్యూఢిల్లీ: ఈ ఏడాది నవంబరు 1 నుంచి 80 శాతం సిబ్బంది వేతనాన్ని పెంచనున్నట్లు నాస్‌డాక్ లిస్టెడ్ ఐటీ కంపెనీ కాగ్నిజెంట్ గురువారం ప్రకటించింది. సీనియర్ అసోసియేట్ లెవెల్ వరకు ఉద్యోగులకు వేతన పెంపు ఉండనుందని తెలిపింది. జీతం పెంపు శాతం ఉద్యోగి పనితీరు, ఏ దేశంలోని కార్యాలయంలో పనిచేస్తున్నాడనే ప్రాతిపదికన నిర్ణయించనున్నట్లు కాగ్నిజెంట్ అధికార ప్రతినిధి వెల్లడించారు. భారత్‌లో నిలకడగా మంచి పనితీరు కనబరుస్తున్న ఉద్యోగికి 9 శాతం వరకు జీతం పెరిగే అవకాశం ఉందన్నారు. టాప్ పెర్‌ఫార్మర్లకు అత్యధిక వేతన పెంపు లభించనుందన్నారు. ఈ ఏడాది ద్వితీయార్థంలో తమ ఉద్యోగులకు పనితీరు ఆధారంగా వేతనాలను పెంచాలనుకుంటున్నట్లు గత నెల 31న రెండో త్రైమాసిక ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగానూ కంపెనీ వెల్లడించింది. ఈ మార్చిలో కాగ్నిజెంట్ తన ఉద్యోగులకు గడిచిన మూడేళ్లలో అత్యధిక బోన్‌సను ప్రకటించింది. కాగా, దేశీయ ఐటీ దిగ్గజం టీసీఎస్ కూడా గత వారంలో 80 శాతం సిబ్బందికి (జూనియర్ నుంచి మధ్య స్థాయి వరకు ఉద్యోగులకు) వేతన పెంపును ప్రకటించింది.అమెరికన్ ఐటీ కంపెనీ ఒరాకిల్ తన క్లౌడ్ విభాగం నుంచి 150కి పైగా ఉద్యోగులను తొలగించబోతున్నట్లు తెలిసింది. కంపెనీ తాజా నిర్ణయంతో యూఎసతో పాటు భారత కార్యాలయాల్లోని ఈ విభాగ ఉద్యోగులపై ప్రభావం పడనుందని సమాచారం.

## నవ లిమిటెడ్ లాభం రూ 399 కోట్లు




నవ లిమిటెడ్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.1,232.60 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.399.10 నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే ఆదాయం 2 శాతం, లాభం 10.5 శాతం తగ్గింది. అయితే గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంతో పోల్చితే మాత్రం ఆదాయం 16.7 శాతం, లాభం 31.8 శాతం వృద్ధి చెందింది. కాగా స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.572.70 కోట్ల ఆదాయంపై రూ.141 కోట్ల లాభాన్ని ప్రకటించింది. సమీక్షా త్రైమాసికంలో మెటల్స్ వ్యాపారంతో పాటు ఎనర్జీ పోర్టుఫోలియో పనితీరు మెరుగ్గా ఉండటం కలిసి వచ్చిందని కంపెనీ పేర్కొంది. అయితే జాంబియాలోని విద్యుత్ డివిజన్ మాంబా ఎనర్జీ లిమిటెడ్ (ఎంఈఎల్)కు సంబంధించి 50 శాతం ట్యాక్స్ కన్సెషన్స్ అమలు చేయటం కంపెనీపై కొంత మేర ప్రభావం చూపించిందని తెలిపింది.

## యూపీఐ పీ2పీ కలెక్ట్ రిక్వెస్టలకు స్వస్తి

న్యూఢిల్లీ: డిజిటల్ మోసాలను అరికట్టేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. ఏకీకృత చెల్లింపుల వ్యవస్థ (యూపీఐ)లో పీర్ టు పీర్ (పీ2పీ) కలెక్ట్ రిక్వెస్టలకు స్వస్తి పలుకుతున్నట్లు గురువారం ప్రకటించింది. ఈ అక్టోబరు 1 నుంచి బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్ల (పీఎసపీ) తో పాటు ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం వంటి థర్డ్ పార్టీ డిజిటల్ పేమెంట్ యాప్‌లు.. యూపీఐలో పీ2పీ కలెక్ట్ రిక్వెస్ట్ లావాదేవీలను అనుమతించరాదని ఎన్‌పీసీఐ నిర్దేశించింది. తమ వ్యవస్థలో తదనుగుణంగా మార్పులు చేసుకోవాలని కోరింది. యూపీఐ వినియోగదారుల్లో ఒకవ్యక్తి మరో వ్యక్తి నుంచి నగదు కోరేందుకు పీ2పీ కలెక్ట్ రిక్వెస్ట్ ఫీచర్ వీలుకల్పిస్తుంది. ముఖ్యంగా స్నేహితులు లేదా సన్నిహితులు తమ మధ్య తిరిగి చెల్లింపులు లేదా బిల్లు చెల్లింపు భారాన్ని సమంగా పంచుకునేందుకు (స్ప్లిట్టింగ్ బిల్స్) దీన్ని విరివిగా వినియోగించుకుంటున్నారు. ప్రస్తుతం ఒక వ్యక్తి పీ2పీ కాల్ రిక్వెస్ట్ లావాదేవీ ద్వారా మరో వ్యక్తి నుంచి రూ.2,000 వరకు పొందే వీలుంది. రోజులో గరిష్ఠంగా 50 లావాదేవీలు నెరిపేందుకు అనుమతి ఉంది. అయితే, ఈ మార్గంలోనూ డిజిటల్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో ఎన్‌పీసీఐ వీటిని నిలిపివేయాలని నిర్ణయించింది.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006